PRAJASAKTI Regd.No. 15795/68


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 352 | విజయవాడ, గురువారం 24 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 24 July 2025 | Rs



లాల్ సలామ్ అచ్యుతానందన్

అధికార లాంఛనాలతో అంతిమ వీడ్కోలు • అడుగడుగునా లక్షలాదిగా పోటెత్తిన జనం



కమ్యూనిస్టు యోధ, ప్రజాభిమాన నేత కామ్రేడ్ విఎస్‌కు అంతిమ వీడ్కోలు పలుకుతున్న అశేష జనవాహిని

అలప్పూజ : కమ్యూనిస్టు యోధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ అంత్యక్రియలు పూర్తిస్థాయి అధికార లాంఛనాలతో అలప్పూజ జిల్లా వాలియా చుడుక్కాడ్ వద్ద పున్నప్ర-వాయలార్ అమరవీరుల స్మారకం వద్ద బుధవారం సాయంత్రం జరిగాయి. పి.కృష్ణ పిళ్ళై, టి.వి.థామస్, ఎన్.శ్రీధరన్, పి.కె.చంద్రనందన్, కె.ఆర్.గౌరిలతో సహా ప్రముఖ కమ్యూనిస్టు నేతలు శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంటున్న ప్రాంతానికి సమీపంలోనే అచ్యుతానందన్ అంత్యక్రియలు కూడా నిర్వహించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, గవర్నర్ ఆర్‌వి ఆర్లేకర్, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి, ప్రకాశ్ కరత్, బృందాకరత్, బిమన్ బసు తదితర ప్రముఖులు ఘనంగా నివాళు లర్పించారు. అచ్యుతానందన్ తనయుడు డాక్టర్ విఎ అరుణ్‌కుమార్ రాత్రి 9 గంటల సమయంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అంతకుముందు అలప్పూజలోని పరావుర్‌లో గల నివాసం నుండి వెల్లిక్కకట్‌కు ఆయన భౌతిక కాయం బుధవారం మధ్యాహ్నానికి చేరుకుంది. వేలాదిమంది ప్రజలు, కార్యకర్తలు, అభిమానుల కన్నీటి నివాళితో ఆ ప్రాంతమంతా విషాదమయంగా, భారంగా మారింది. రాజకీయ పార్టీలకు అతీతంగా వివిధ రంగాలకు చెందినవారు పాల్గొన్నారు.

96ఏళ్ల అచ్యుతానందన్ సోదరి అళికుట్టి మౌనంగానే తన అన్నకు తుది వీడ్కోలు పలికారు. వృద్ధాప్యం, అనారోగ్యంతో ఆమె గత కొన్ని నెలలుగా మంచానికే పరిమితమయ్యారు. ఒకప్పుడు స్ఫూర్తికి, చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఆ చెల్లెలు ఈనాడు తన అన్న మరణవార్తను ఎలాంటి హావభావాలు లేకుండా మౌనంగా విన్నారు.

150కిలోమీటర్ల దూరానికి 22గంటలు !

తిరువనంతపురం నుండి పరావుర్‌కు మధ్య దూరం దాదాపు 150కిలోమీటర్లు, అంతిమయాత్ర వాహనం ఈ దూరాన్ని చేరుకోవడానికి 22గంటలకు పైగా పట్టింది. తమ మనస్సులకు దగ్గరైన ఆ ప్రజా నేత మృతి వార్తకు ప్రజలు ఎంతగా కదిలిపోయారో, తమ ఆవేదనను ఎలా వ్యక్తం చేశారో, కడసారిగా ఒకసారి చూద్దామని ఎంతలా తహతహలాడి పోయారో తెలుసుకోవడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు. విఎస్ తన ఆరోగ్యం సహకరించేంతవరకూ ఇక్కడకు ఎక్కువగా వస్తూనే వుండేవారు. పున్నప్ర అమరవీరులకు అంజలి ఘటించేవారు. పున్నప్ర చారిత్రక తిరుగుబాటు 73వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన చివరిసారిగా ఇక్కడకు వచ్చారు.పరావుర్‌లోని ఆయన నివాసం మిగతా 7లో

నినాదాల హోరు

లాల్ సలామ్, మా హృదయాల్లో విఎస్ చిరస్థాయిగా నిలిచి వుంటారు, ఆయన వంటి నేతను మరొకరిని చూడలేం వంటి నినాదాలు, వ్యాఖ్యలతో ఆ ప్రాంతాలన్నీ హోరెత్తిపోతున్నాయి. పైనుండి పడుతున్న వర్షపు ధారలను కూడా లెక్కచేయకుండా, కదలకుండా, మెదలకుండా నిలుచున్నారు.


విఎస్ అంటే కేవలం రాజకీయ నేత కాదు, కేరళ మనస్సాక్షి. ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా, పార్టీ కార్యదర్శిగా ఆయన తుదికంటా ప్రజా సేవలోనే తరించారు. నోరు లేని బడుగుజీవుల వాణిగా నిలిచారు. ఎలాంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనా తాను నమ్మిన ఆశయాలు, ఆదర్శాలను వీడలేదు. అటువంటి నేత తమను వీడి వెళ్లినపుడు ఆయన అభిమానులు కూడా అంతే నిబద్ధతను ప్రదర్శించారు. గంటలతరబడి నిలుచుని మరీ తమ నేతను చూసుకుని కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు.

తండ్రీ, కొడుకు దారుణ హత్య

- నరసరావుపేటలో కిడ్నాప్
- సంతమాగులూరులో హత్య

ప్రజాశక్తి- సంతమాగులూరు, బాపట్ల జిల్లా

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తలెత్తిన వివాదం కారణంగా తండ్రీ, కొడుకు దారుణ హత్యకు గురయ్యారు. చెక్‌బౌన్స్ కేసులో కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన వీరిని దుండగులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లి ఓ వెంచర్‌లో ఈ దారుణానికి పాల్పడ్డారు. బాపట్ల జిల్లా సంతమాగులూరులో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... బెంగుళూరులోని కలిగోడి ప్రాంతానికి చెందిన తండ్రీ, కొడుకులు కె.వీరాస్వామి రెడ్డి (60), కెవి.ప్రశాంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వీరి వ్యాపారంలో బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన గడ్డం అనీల్ కుమార్‌రెడ్డి, మరికొందరు భాగస్వాములుగా ఉన్నారు. రూ.2 కోట్ల నగదు విషయంలో గత కొంతకాలంగా భాగస్వాముల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో వీరాస్వామి రెడ్డి, ప్రశాంత్ రెడ్డి చెక్కులు ఇచ్చారు. అవి చెల్లకపోవడంతో గడ్డం అనీల్‌కుమార్ రెడ్డి ఒంగోలు, అద్దంకి, నర్సరావుపేట కోర్టుల్లో చెక్‌బౌన్స్ కేసులు వేశారు. ఈ కేసులో కోర్టుకు హాజరయ్యేందుకు బెంగళూరు నుంచి నరసరావుపేట వచ్చి కోర్టు సమీపంలో ఓ లాడ్జిలో తండ్రీ, కొడుకు బస చేశారు. హోటల్‌కు వెళ్లి టిఫిన్ తిని బయటకు వస్తున్న వారిపై గుర్తు తెలియని దుండగులు ఆకస్మికంగా దాడి చేశారు. అనంతరం తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో ఉన్న స్కార్పియో వాహనంలో సంతమాగులూరు వైపు తీసుకెళ్లారు. ఈ విషయాన్ని గమనించి స్థానికులు, కొందరు లాయర్లు వాహనాల్లో వెంబడించినా వారు వేగంగా వెళ్లిపోయారు. అనంతరం సంతమాగులూరు సమీపంలోని ఓ ప్రైవేట్ వెంచర్లోకి తీసుకెళ్లి అతి దారుణంగా నరికి హత్య చేశారు. ఆ తర్వాత వాహనాన్ని చిలకలూరిపేటలో వదిలేసి పరారయ్యారు. బాపట్ల ఎస్‌పి తుషార్ డూడీ, డిఎస్‌పి గోగినేని సీతారామాంజనేయులు, క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రియల్ ఎస్టేట్ వ్యాపార లావాదేవీల్లో విభేదాలే ఈ హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. నిందితుల ఆచూకీ కోసం నాలుగు టీములను ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. సంతమాగులూరు సిఐ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కె.వీరాస్వామిరెడ్డి (ఫైల్)



కెవి.ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

రూ.20 వేల కోట్ల పెట్టుబడులు

- విశాఖలో రూ.16,466 కోట్లతో డేటా సెంటర్
- ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రూ.20,126 కోట్ల పెట్టుబడులకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్‌ఐపిబి) ఆమోదం తెలిపింది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఎస్‌ఐపిబి సమావేశం బుధవారం జరిగింది. దీనిలో 20 లక్షల ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ ఛైర్మన్ నారా లోకేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు. కొత్తగా వచ్చే పెట్టుబడుల ద్వారా 50,600 ఉద్యోగాలు వస్తాయని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. భవిష్యత్ పెట్టుబడుల అవసరాలకు తగిన విధంగా మాస్టర్‌ప్లాను ఉండాలని, సంస్థలకు అనువైన భూమిని చూపాల్సి ఉందని అన్నారు. మౌలిక వసతుల సమస్యలు రాకుండా చూడాలన్నారు. విశాఖలో భూమి లభ్యత తక్కువగా ఉందని, ఇప్పటికే అర్సెల్లార్ మిట్టల్ స్టీల్‌ప్లాంటు సహా అనేక సంస్థలకు భూములు ఇస్తున్నామని చెప్పారు.

ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూడాలని పేర్కొన్నారు. కనెక్టివిటీకి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సిఫి ఇన్ఫినిటీ మొదటి దశలో రూ.1,466 కోట్లు పెట్టుబడి పెడుతుందని, 200 మందికి ఉపాధి వస్తుందని వివరించారు. రెండోదశలో రూ.15 వేలకోట్లు పెట్టుబడులు, 500 మందికి ఉపాధి వస్తుందని వివరించారు. సాత్వా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ విశాఖపట్నం మధురవాడలో రూ.1500 కోట్ల పెట్టుబడులు పెడుతుండగా, 25 వేలమందికి ఉపాధి వస్తుందని తెలిపారు. బివిఎం ఎనర్జీ, ఎఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ వంటివి పెద్దయెత్తున పెట్టుబడులు పెడతున్నాయని వివరించారు.



113 ప్రాజెక్టులకు రూ.5,94,454 కోట్ల పెట్టుబడులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకూ జరిగిన ఎస్‌ఐపిబి సమావేశాల్లో 113 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఇందులో పారిశ్రామిక రంగానికి చెందిన 46 ప్రాజెక్టులు, ఇంధన రంగానికి చెందిన 41, పర్యాటక రంగంలో 11, ఐటిలో 11, ఫుడ్ ప్రాసెసింగ్‌లో నాలుగు పరిశ్రమల పెట్టుబడులకు ఎస్‌ఐపిబి ఆమోదం తెలిపింది. వీటి ద్వారా మొత్తం రూ.5,94,454 కోట్లు విలువైన పెట్టుబడులు రానున్నాయి. అలాగే 5,56,568 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

ఏడాదిలో రూ.120 బిలియన్ల పెట్టుబడులు

- ఇన్వెస్టోపియా సదస్సులో సిఎం
- ఎపిఇబిడి-యుఎఇ మధ్య ఒప్పందాలు 7

భారత వృద్ధికి టారిఫ్‌ల దెబ్బ

- జిడిపి అంచనాలకు ఎడిబి కోత
- ఈ ఏడాది 6.5 శాతమే

చెన్నయ్ : భారత వృద్ధి రేటు అంచనాలకు ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) కోత పెట్టింది. ఎడిబి తన తాజా ఆసియన్ డెవలప్‌మెంట్ అవుట్‌లుక్ నివేదికను విడుదల చేసింది. ఆ వివరాలు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత జిడిపి 6.5 శాతానికే పరిమితం కానుంది. ఇంతక్రితం ఈ అంచనా 6.7 శాతంగా పేర్కొంది. అమెరికా ఇటీవల అమలు చేసిన టారిఫ్ విధానాలు భారత ఎగుమతులను ప్రభావితం చేయడమే ఈ తగ్గింపుకు ప్రధాన కారణం. అయినప్పటికీ.. బలమైన దేశీయ డిమాండ్, అనుకూల రుతుపవనాలు, దృఢమైన సేవల రంగం భారతదేశాన్ని ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలబెడతాయని ఎడిబి పేర్కొంది. వచ్చే ఏడాది 2026-27లో 6.7 శాతం వృద్ధి ఉండొచ్చని తెలిపింది. 2025-26లో ద్రవ్యోల్బణం 3.8 శాతంగా ఉండొచ్చు. 2026లో ఆసియా 4.6 శాతం పెరగొచ్చు. ఇంతక్రితం ఈ అంచనా 4.7 శాతంగా ఉంది.

మూడోరోజూ అట్టుడికిన పార్లమెంటు

- బీహార్ ఎస్ఐఆర్, పహల్గాంపై చర్చకు ప్రతిపక్షాల పట్టు
- ఆందోళనల మధ్యే లోక్‌సభలో రెండు బిల్లులు
- 29 నుంచి ఆపరేషన్ సిందూర్‌పై చర్చ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పహల్గాం ఉగ్రదాడి, బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ అంశాలు పార్లమెంటు వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్నాయి. సమావేశాలు ప్రారంభమైన వరుసగా మూడో రోజు బుధవారం కూడా ఉభయ సభలు అట్టుడికాయి. బీహార్ ఎస్ఐఆర్, పహల్గాంపై చర్చకు అంగీకరించకుండా కేంద్రం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ... ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంటు ఉభయ సభలు స్తంభించాయి. వాయిదాల నడుమ ఎలాంటి చర్చ జరగకుండానే గురువారానికి వాయిదాపడ్డాయి. బుధవారం ఉదయం 11 గంటలకు ఉభయ సభలు మొదలవగానే.. బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (ఎస్ఐఆర్) పేరుతో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్ష ఎంపిలు నిరసన గళం వినిపించారు. ఎన్నికలకు రెండు నెలల ముందు ఆగమేఘాల మీద ఓటర్ల జాబితాను సవరించడం ప్రజాస్వామ్య విరుద్ధమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల వేళ బిజెపి వ్యతిరేక ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ఎన్నికల సంఘం కేంద్రంతో కలిసి కుట్రకు తెరలేపిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఓటర్ల జాబితాను సవరించడం ఈ మధ్య కాలంలో పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ఈ విషయంపై తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చకు ప్రతిపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆందోళనతో ఉభయసభలు మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. ఆ తరువాత సభలు తిరిగి ప్రారంభమైనప్పటికీ లోక్‌సభలో అదే పరిస్థితి పునరావృతమైంది. ప్రతిపక్ష ఎంపిలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీహార్ ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు డిమాండ్ చేశారు. ఫలితంగా సభలో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. అంతకుముందు ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు, జాతీయ క్రీడా పాలన బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు క్రీడా రంగంలో పారదర్శకతను మిగతా 7లో



బుధవారం లోక్‌సభలో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీ సభ్యులు

విశాఖలో కాషాయ మూకల దందా!

- రాముడి పేరుతో రూ.కోట్ల వ్యాపారం
- బీచ్ రోడ్డులో వివాదంగా 'అయోధ్య' నమూనా సెట్
- భద్రాచలం దేవస్థానం ఇఒ ఫిర్యాదుతో వెలుగులోకి 3



క్వారీ రద్దు చేయాలంటూ దళితుల నిరసన దీక్ష 3


పంచాయతీలకు పైసల్లేవ్ !

- 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలలో తీవ్ర జాప్యం
- వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం
- 7 నెలలైనా విడుదల కాని రూ.1,121 కోట్లు
- ఆందోళన బాటలో సర్పంచులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా మార్చాలి. పంచాయతీలకు నేరుగా నిధులు, స్థానిక సంస్థలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక పటుత్వం అవసరం' ఈ ఏడాది పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్న అంశాలు.

స్థానిక సంస్థల వాస్తవ పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. అధిక సంఖ్యలో పంచాయతీలు తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి. సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాయి. కేంద్రం నుంచి స్థానిక సంస్థల కోసం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. గత ప్రభుత్వం ఇదే పొరపాటు చేసింది. ఆ ప్రభుత్వం తప్పిదాలను ఎత్తిచూపించే కూటమి ప్రభుత్వ పెద్దలు అదే బాటలో నడవడం విమర్శలకు తావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) రాష్ట్రానికి 15వ ఆర్థిక సంఘం రూ.2,152 కోట్ల నిధులు కేటాయించింది. ఈ మొత్తంలో రూ.2,109 కోట్లను విడుదల చేసింది. 2024 సెప్టెంబరులో మొదటి విడత టైడ్, అన్‌టైడ్ గ్రాంటు మొత్తం రూ.988.76 కోట్లు విడుదల చేయగా, రెండవ విడత డిసెంబరు రెండవ వారంలో రూ.1,121.21 కోట్లు విడుదల చేసింది. నిధులు విడుదలై 7 నెలలైనా రాష్ట్రం స్థానిక సంస ్థలకు బదలాయించలేదు. ఆర్థిక సంఘం నిబంధనల ప్రకారం నిధులు విడుదల చేసిన మిగతా 7లో





2 రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు

- విపత్తుల నిర్వహణశాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వాయువ్య బంగాళాఖాతం మీదుగా ఉపరితల ఆవర్తనం విస్తరించడంతో రానున్న రెండు రోజులు ఉత్తరాంధ్రలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వార్షాలు, కోస్తాంధ్రలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ మేరకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో చెట్లు, టవర్లు, స్థంభాల కింద, బహిరంగ ప్రదేశాల్లో నిలబడరాదని సూచించారు. గురు, శుక్రవారాల్లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు.

మహేష్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం, వెలవలపల్లి గ్రామ దళిత యువకుడు దోనిపాటి మహేష్‌ను కిడ్నాప్ చేసి, ఆయనపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. బాధితుడు మహేష్‌కు మెరుగైన వైద్యం అదించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధిపత్య కులానికి చెందిన యళ్లమల్లి విజయ్ అతని అనుచరులు, మంత్రి అనుచరులమంటూ రాయల్ కాలేజీ యాజమాన్యం దాడి చేశారని, వీరిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో దళితులు, గిరిజన, బలహీన తరగతులపై దాడులు పెరుగుతున్నాయని, రాజకీయ నాయకుల అనుచరులమంటూ వారి అండదండలతో దాడులకు తెగబడటం తగదన్నారు. ఇటువంటి వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. మహేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని, రక్షణ కల్పించాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే ప్రత్యక్ష ఆందోళన

బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలో నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న భవన నిర్మాణ కార్మికుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు అన్నారు. ఆగస్టు 15లోగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. రెండ్రోజులపాటు జరగనున్న ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఎనిమిదవ మహాసభ గుంటూరులో బుధవారం ప్రారంభమైంది. రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రమణరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో నాగేశ్వరరావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం మాట ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. కార్మికుల శ్రమతో వసూలైన సెస్‌ను దారి మళ్లిస్తోందని వివరించారు. కార్మికులకు మాత్రం పథకాలు అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బోర్డును పునరుద్ధరించి, కార్మికులకు పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులున్నారని, ఎన్నికల్లో వారికి అనేక హామీలు ఇచ్చి, గెలిచిన తర్వాత వాటిని పాలకులు మరిచారన్నారు. పోలవరం నిర్మాణ సంస్థ రూ.25వేల కోట్ల పనులు చేపట్టి ఒక్క రూపాయి కూడా సెస్ చెల్లించలేదని, దేశ వ్యాప్తంగా దాదాపు రూ.70 వేల కోట్ల సెస్‌ను కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయడం లేదని తెలిపారు. 11 ఏళ్ల మోడీ పాలనలో సామాన్య ప్రజల కంటే అంబాని, అదానిల బాగు కోసమే పనిచేశారని విమర్శించారు. మహాసభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ప్రసంగించారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి.నరసింహారావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. తొలుత యూనియన్ జెండాను రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రమణరావు, సిఐటియు జెండాను వి.ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం కార్మికోద్యమ నాయకులు, కేరళ మాజీ సిఎం అచ్యుతానందన్ చిత్రపటానికి, ఆర్.సత్యనారాయణరాజు చిత్రపటానికి ఉమామహేశ్వరరావు, రమణరావు పూలమాల వేసి నివాళులర్పించారు.



మహాసభలో మాట్లాడుతున్న ఎ.వి.నాగేశ్వరరావు

మినిమం టైంస్కేల్ అమలు చేయాలి

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ జెఎసి
- మంత్రి అచ్చెన్నాయుడు, సిఎస్‌కు వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పథకాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ టీచర్స్, వర్కర్స్ జెఎసి కోరింది. వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావుతో కలిసి జెఎసి నాయకులు బుధవారం విజయవాడలో వినతిపత్రం అందించారు. అనంతరం పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తితో కలిసి ఈ అంశంపైనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌కు సచివాలయంలో వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 3.5 లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినహా మిగిలిన 3 లక్షల మందికి గత ప్రభుత్వం మినిమం టైమ్‌స్కేల్‌ను అమలు చేయలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ పథకాల్లో హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ అనంతరం బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం, గ్రాట్యూటీ ఇవ్వాలని కోరారు. కూటమి మేనిఫెస్టోల్లో ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలు, ఒకే కేడర్ ఒకే వేతనం అమలు చేయాలని కోరారు. వైద్యారోగ్యశాఖలో తొలగించిన డిఎస్‌సి పారా మెడికల్ సిబ్బందిని కొనసాగించాలని కోరారు. జిఓ 114 ప్రకారం అందర్నీ రెగ్యులరైజ్ చేయాలని, ఆ లోపు వారిని ఆప్కాస్‌లో కొనసాగించాలని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కో-ఛైర్మన్ బి కాంతారావు, కోశాధికారి డి దయామణి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్ అహ్మద్ ఉన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విద్యుత్ సంస్థల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌కు సచివాలయంలో యూనియన్ నేతలు కలిసి వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, నాన్ రెగ్యులర్ ఉద్యోగులందర్నీ సంస్థలో విలీనం చేయాలని కోరారు. 2022 పిఆర్‌సి ఎరియర్స్‌తో సహా బకాయిలు వెంటనే చెల్లించాలని తెలిపారు. అందరికీ కనీస వేతనం బేసిక్ పేగా రూ.46 వేలు చెల్లించాలని కోరారు. సిఎస్‌ను కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎవి నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముజఫర్ అహ్మద్ ఉన్నారు.

ఎపిఇఆర్‌సి ఛైర్మన్‌ను ఎప్పటిలోగా నియమిస్తారు?

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఛైర్మన్‌ను ఎప్పటిలోగా నియమిస్తారో చెప్పాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇతర ప్రతివాదులకు నోటీసులిచ్చింది. విచారణను సెప్టెంబర్ 17కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశించింది. ఎపిఇఆర్‌సి ఛైర్మన్ పోస్టును భర్తీ చేయకపోవడాన్ని డాక్టర్ దొంతిరెడ్డి నరసింహారెడ్డి సవాల్ చేస్తూ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. 2024 అక్టోబర్ నుంచి ఛైర్మన్ పోస్టు ఖాళీగా ఉందని, ఎపిఇఆర్‌సిలో సభ్యుడి పోస్టును భర్తీ చేసేందుకు ఈ ఏడాది జూన్‌లో నోటిఫికేషన్ వెలువడిందని న్యాయవాది చెప్పారు. ఛైర్మన్ పోస్టు భర్తీ ప్రస్తావన లేదన్నారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రణతి స్పందిస్తూ, ఎపిఇఆర్‌సి ఛైర్మన్‌గా జస్టిస్ నాగార్జునరెడ్డి పదవీ విరమణ చేశారని, ఆ తర్వాత ఇఆర్‌సి సభ్యుడు ఠాకూర్ రామ్ సింగ్ ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా వ్యవహరించారని, అయితే, గత ఫిబ్రవరిలో రామ్ సింగ్ పదవీ విరమణతో ఆ పోస్టు ఖాళీగా ఉందని వివరించారు.

సెప్టెంబర్ 14, 15 తేదీల్లో తిరుపతిలో జాతీయ మహిళా సాధికారత సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతిలో సెప్టెంబర్ 14, 15 తేదీల్లో జాతీయ మహిళా సాధికారిత సదస్సు నిర్వహించనున్నట్లు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సదస్సు ఏర్పాట్లపై తిరుపతి కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. దేశంలోని మొత్తం 31 అసెంబ్లీల్లోని మహిళా సాధికారత కమిటీల నుంచి ఈ సదస్సుకు ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఇందుకు సంబంధించిన నివేదికను పార్లమెంట్, ఆయా రాష్ట్రాల అసెంబ్లీలలో చర్చించి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకష్ణరాజు, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంజినీరింగ్ తొలిదశ కౌన్సెలింగ్

- 1.18 లక్షల సీట్లు భర్తీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశాల పరీక్ష (ఇఎపిసెట్) తొలిదశ కౌన్సెలింగ్ ముగిసింది. ఈ నెల 7న ప్రారంభమైన తొలిదశ కౌన్సెలింగ్‌లో 1,26,033 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. వీరిలో 1,25,205 మంది అర్హులుగా తేలింది. అర్హులైన వారిలో 1,24,655 మంది ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ద్వారా కళాశాలలను ఎంపిక చేసుకున్నారు. రాష్ట్రంలో 244 ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 1,52,246 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

తొలిదశలో 1,18,525 మంది సీట్లు పొందినట్లు ఇఎపిసెట్ అడ్మిషన్ల కన్వీనర్ జి గణేష్‌కుమార్ తెలిపారు. 33,721 సీట్లు భర్తీ కాలేదని వెల్లడించారు. అభ్యర్థులు ఈ నెల 24 నుంచి 26 వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఆగస్టు 4 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఎపి క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నుంచి తుది జాబితా అందకపోవడం వల్ల స్పోర్ట్స్ కోటాకు సంబంధించిన 674 సీట్లను భర్తీ చేయలేదని పేర్కొన్నారు. అదే విధంగా ఎన్‌సిసి కోటా తుది జాబితా కూడా అందకపోవడం వల్ల 1,367 సీట్లను కూడా భర్తీ చేయలేదని వెల్లడించారు. నారాయణాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఒక్క సీటు కూడా భర్తీ కాలేదు. ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 94 సీట్లకు 6, ప్రియదర్శిని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 190 సీట్లకు 9 సీట్లే భర్తీ అయ్యాయి.

ముగిసిన ఇసెట్ కౌన్సెలింగ్

డిప్లమో విద్యార్థులు ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందే ఇసెట్ తుదిదశ కౌన్సెలింగ్ బుధవారంతో ముగిసింది.

మొత్తం 31,922 మంది ఇసెట్‌లో అర్హత సాధించగా, 22,633 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. మొత్తం 22,459 మంది సీట్లు పొందారు. మొత్తం 233 కళాశాలల్లో 36,534 కన్వీనర్ సీట్లు అందుబాటులో ఉండగా, 20,837 భర్తీ అవ్వగా 15,697 ఖాళీగా ఉన్నాయి.

పోలవరం ప్రాజెక్టులో మునిగి మీ చావు మీరు చావండి

- గిరిజనులను ముంపులో ముంచుతున్న ప్రభుత్వాలు
- మొదటిదశ వరకే పునరావాస అనుమతినిచ్చిన ప్రభుత్వాలు
- రెండోదశకు ఇవ్వని కేంద్రం.. అడగని రాష్ట్రం
- 38,060 కుటుంబాల్లో 9265 మందికే ఇళ్ల పట్టాలు
- గోదావరి వరద నేపథ్యంలో బయటపడ్డ నివేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టు పునరావాసం విషయంలో ప్రభుత్వాలు అత్యంత కర్కశంగా వ్యవహరిస్తున్నాయి. ప్రాజెక్టు కోసం తమ జీవితాలను ధారబోసిన గిరిజనులను ప్రాజెక్టు నీటిలో ముంచేసే విధంగా వ్యవహరిస్తున్నాయి. కాంటూరు అంచనాల విషయంలో ప్రభుత్వాలు చేసిన తప్పిదం గిరిజనులకు మరణశాసనం రాస్తోంది. కాంటూరు గుర్తింపుపై తప్పుడు అంచనాలతో 41.15 మీటర్ల ఎత్తు నిర్మిస్తే 45.72 మీటర్ల కంటే ఎక్కువ ప్రాంతం మునిగిపోతోంది. 45.72 మీటర్ల ఎత్తులో ముంపునకు గురవుతాయని గుర్తించిన గ్రామాలు కాపర్‌డ్యామ్ వద్ద వరద 36 మీటర్లకు వచ్చినప్పుడే మునిగిపోతోంది. ముంపు నిర్ధారణలోనే తప్పుడు అంచనాలు వేయడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. 41.15 మీటర్లకు ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యామ్ (ఇసిఆర్‌ఎఫ్) పూర్తయితే ఈ ముంపు మరింత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఎస్‌టి కమిషన్‌కు ఇచ్చిన సమాధానాల్లో ఈ విషయాలన్నీ బయటకొచ్చాయి. తమకు 41.15 మీటర్ల వరకే పునరావాసానికి అనుమతి వచ్చిందని, 45.72 మీటర్లకు చేపట్టాలంటే కేంద్రం నుండి అనుమతి రావాలని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ప్రకారం పునరావాసం కల్పించాల్సిన కుటుంబాలు 16,642 ఉంటే అందులో 9,249 కుటుంబాలు గిరిజనులవే కావడం బాధాకరం. అయితే ఈ లెక్కల్లోనూ తప్పులున్నాయని గిరిజన ప్రతినిధులు, పలు సంఘాల నాయకులు చెబుతున్నారు.

ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలను ఎన్నిటిని గుర్తించారు ?

జవాబు : మొత్తం 96,660 కుటుంబాలను గుర్తించాము. వీరికి పునరావాసాన్ని రెండు దశల్లో చేపడతాము. మొదటిదశలో 41.15 (కాంటూరు) మీటర్లకు రెండోదశలో 45.72(కాంటూరు) పరిధిలో చేపడతాము. మొదటిదశలో 38,060 ఫ్యామిలీలను గుర్తించాము. 222 రెవెన్యూ గ్రామాల పరిధిలో 371 నివాస ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. కుడి, ఎడమ కాలువల పరిధిలో రెండు గ్రామాలు మొత్తం ప్రాజెక్టు కింద 373 గ్రామాలు ప్రభావితమవుతాయి.

ఇప్పుడు ఏ దశకు పునరావాసం అమలు చేస్తున్నారు ?

జవాబు : ప్రభుత్వం భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణం మొదటిదశకే ప్లాను చేసింది. రెండోదశకు కేంద్రం నుండి అనుమతి వచ్చిన తరువాత చేపడతాము. భూసేకరణ, పునరావాసం పనులను 2013 భూ సేకరణ చట్టం ప్రకారం చేస్తున్నాము.

ఎన్ని ఆర్అండ్ఆర్ కాలనీలకు ప్లాను చేశారు ? వాటిల్లో ఎన్నిటికి అనుమతిచ్చారు. ఎన్నిటిని మంజూరు చేశారు ?

జవాబు : మొదటిదశలో 21,418 కుటుంబాలకు సంబంధించి 76 కాలనీలకు అనుమతి వచ్చింది. 16,642 కుటుంబాలకు సంబంధించిన ప్రణాళిక అమల్లో ఉంది. అనుమతి వచ్చిన కాలనీల్లోనూ 26 కాలనీలు పూర్తి చేశాము. 50 కాలనీల్లో పనులు చేస్తున్నాము. 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నాము. అన్ని కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాము. చెత్తను కూడా గ్రామ పంచాయతీల ద్వారా నిర్వహిస్తున్నాము. కొత్తకాలనీల్లో మత పరమైన సంస్థలకు భూమిని కేటాయించారు. అలాగే శ్మశానవాటికలకూ స్థలం కేటాయించారు.

తరలించిన కుటుంబాల్లో ఎంతమందికి నష్టపరిహారం అందించారు ?

జవాబు : మొదటిదశ ఆర్అండ్ఆర్ కింద 20,875 (52.04 శాతం) కుటుంబాలకు పరిహారం అందించాము. 1894, 2013 భూసేకరణ చట్టం కింద భూములు తీసుకున్న తరువాత రైతులకు పరిహారం అందించాము.

పునరావాసుల్లో ఎంతమందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు ?

జవాబు : 38,060 కుటుంబాల్లో 9,265 కుటుంబాలకు పట్టాలు ఇచ్చాము.

పునరావాసుల్లోనూ, ముఖ్యంగా ఎస్‌టి ఫ్యామిలీల ఉపాధికి ఏమైనా చర్యలు తీసుకున్నారా ?

జవాబు : ప్రాజెక్టు ఆఫీసర్ల సమన్వయంతోనూ, ఐటిడిఎ సహకారంతో ఉపాధి కల్పన శిక్షణ ముఖ్యంగా కంప్యూటర్ ట్రైనింగ్, స్వయం ఉపాధికి సంబంధించిన మెకానికల్ పనులు, కుట్టుపని, డ్రైవింగ్ శిక్షణ వంటివి ఇప్పిస్తున్నాము.

ఇప్పటి వరకూ 5,223 మందికి ఉపాధి కల్పించాము. పునరావాస కాలనీల చుట్టూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా వారికి నేరుగా ఉపాధి కల్పించడంతోపాటు ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాము.

వ్యవసాయ, అటవీ ఆధారిత జీవనోపాధికి నష్టం జరిగిన వారికోసం ఏమి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు : భూములు కోల్పోయిన వారికి వ్యవసాయం చేసుకునేందుకు 2 ఎకరాల 50 సెంట్ల వరకూ భూమిని ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాము. అటవీ ప్రాంతం మునిగిపోయే వరకూ గిరిజనులకు ఉన్న రికగ్నేషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ (ఆర్ఒఎఫ్ఆర్) హక్కులు కొనసాగుతాయి.

కొత్త కాలనీలో ఎన్ని స్కూళ్లు, అంగన్‌వాడీ సెంటర్లు ఏర్పాటు చేశారు ?

జవాబు : మొదటిదశలో 79 స్కూళ్లు మంజూరయ్యాయి. 55 స్కూళ్లను పూర్తి చేశాము. 94 అంగన్‌వాడీ సెంటర్లు మంజూరవగా 59 నిర్మిస్తున్నాము. 2013 భూసేకరణ చట్టం ప్రకారం వైద్య సదుపాయాలు కల్పిస్తున్నాము.

కొత్త నివాస ప్రాంతాల్లో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయా ?

జవాబు : ప్రతి కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్, పిడిఎఫ్ దుకాణం కేటాయిస్తారు. అర్హతను బట్టి పెన్షన్ పొందుతారు.

ఎన్ని గిరిజన కుటుంబాలను తరలించారు ? ఎంత మందికి పునరావాసం కల్పించారు ? వారి కాలనీలు షెడ్యూల్డ్ ఏరియాలోనే ఉన్నాయా ?

జవాబు : మొదటిదశ 18,320 గిరిజన కుటుంబాలు ముంపునకు గురవుతాయి. వాటిల్లో 9,249 మందికి పునరావాసం కల్పించాము. పరిహారం చెల్లించాము. వారికి ఏర్పాటు చేసిన కాలనీలు షెడ్యూల్డ్ ఏరియాలోనే ఉన్నాయి.

థర్డ్‌పార్టీ సామాజిక సర్వే చేశారా ?

జవాబు : పునరావాస కాలనీలన్నీ పూర్తయ్యాక సర్వే చేపడతాము.

రాష్ట్రంలో ఎస్‌ఐఆర్ దిశగా అడుగులు ?

- నేడు రాజకీయ పార్టీలతో సిఇఒ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియను రాష్ట్రంలో ముందుకు తీసుకెళ్లేందుకు సన్నద్ధత దిశగా అడుగులు పడుతున్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసరు (సిఇఒ) ఈ నెల 24న ఉదయం 11 గంటలకు సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి రావాలంటూ ఆయా పార్టీలకు ఇప్పటికే ఆహ్వానాలు పంపారు. ఓటర్ల జాబితా చట్టపరమైన పరిధికి లోబడి ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడంతో పాటు ఓటర్ల సవరణకు ముందు కార్యకలాపాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. పైకి ఎన్నికల వ్యవస్థ బలోపేతం చేయడం, ఎన్నికల ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సమావేశాలని చెబుతున్నప్పటికీ ఇది ఎస్‌ఐఆర్ అమలుకు సన్నద్ధం చేయడానికేనని విశ్లేషకుల భావన. బీహార్‌లో ఇప్పటికే ఎస్‌ఐఆర్ వివాదం నడుస్తోంది. సవరణల పేరుతో దొడ్డిదారిన పౌరసత్వచట్ట అమలుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌తో ఇప్పటికే సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. అంతే కాకుండా భారీగా ఓట్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ విపక్షపార్టీలు సడక్ సే సదన్ తక్ (వీధి నుంచి సభ వరకు) పేరుతో పోరాటాలు చేస్తామని ప్రకటించిన సంగతి విదితమే. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బీహార్ ఎస్‌ఐఆర్ పేరుతో .జరుగుతున్న ఓటు బ్యాంకు రాజకీయాలను పార్లమెంటు వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలని ఇండియా బ్లాక్ నేతలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఐఆర్ ప్రక్రియను జనరలైజ్ చేస్తూ అన్ని రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలతో సమావేశాలు, సలహాలు, సూచనలంటూ ఓటర్ల తొలగింపు ప్రక్రియ తీవ్రతను తగ్గించేందుకు కేంద్రం ప్రణాళికలు రచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఓటర్ల జాబితా సవరణను పౌరసత్వంతో ముడి పెట్టరాదని ఇటీవల తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం.. కేంద్ర ఎన్నికల సంఘాన్ని లిఖిత పూర్వకంగా కోరింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఏం చేయనున్నదీ గురువారం నాటి సమావేశంలో కొంత వెల్లడవుతుందని భావిస్తున్నారు.

ఎఐతో వసతి గృహాల పర్యవేక్షణ : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)తో బిసి వసతి గృహాల పర్యవేక్షణ చేపట్టనున్నట్లు, ఇందుకు త్వరలోనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఎఐతో బిసి వసతి గృహాల్లో జవాబుదారీతనం మరింత పెరగనున్నట్లు వెల్లడించారు. విజయవాడలోని ఓ హోటల్‌లో అన్ని జిల్లాల బిసి సంక్షేమశాఖ అధికారులు, డిబిసిడబ్ల్యుఇఒలు, ఎబిసిడబ్ల్యుఇఒలతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు నెలాఖరు నాటికి వసతి గృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అడ్మిషన్ల సంఖ్య పెంచాలని, వచ్చే నెల 5వ తేదీ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ ఆధారిత గుర్తింపు అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్)లో ఆటంకాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. హెచ్‌డబ్ల్యుఒలు రాత్రి సమయాల్లో వసతి గృహాల్లో ఉండాలన్నారు. డిబిసిడబ్ల్యుఇఒలు, ఎబిసిడబ్ల్యుఇఒలు తరచూ వసతి గృహాలను సందర్శించాలని, వీలైతే రాత్రి బస చేయాలని ఆదేశించారు. అన్ని వసతి గృహాల్లో ఆర్ఒ ప్లాంటు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పి-4లో భాగంగా బిసి వసతి గృహాలను దత్తత ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. ఆదరణ 3.0లో భాగంగా కుల వృత్తిదారులకు ఆధునిక పరికరాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు, ఎంజెపి స్కూల్స్ కార్యదర్శి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి అమలు చేయాలి

- సిఎస్‌కు పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పిఆర్‌సి అమలు చేయాలని, ఆర్థిక బకాయిలు చెల్లించాలని, డిఎలు మంజూరు చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌ను బుధవారం సచివాలయంలో గోపిమూర్తి కలిసి వినతిపత్రం అందించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2023 జూన్ 30తో 11వ పిఆర్‌సి పూర్తయిందని తెలిపారు. 2023 జులై ఒకటి నుంచి 12వ పిఆర్‌సి అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే రెండేళ్ల కాలం వృథా అయ్యిందని వెల్లడించారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. 11వ పిఆర్‌సి ఎరియర్స్ చెల్లించాలని, పెన్షనరీ బెనిఫిట్స్ బకాయిలు వంటి ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు మెమో 57 అమలు చేయాలన్నారు. జిల్లా, మండల పరిషత్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కారుణ్య నియామకాల్లో తీవ్ర జాప్యాన్ని నివారించి నియామకాలు వెంటనే జరపాలని కోరారు. డిఎస్‌సి-2025 కంటే ముందే అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ ఏడాది బ్లాక్‌బర్లీ పొగాకు సాగు నిషేధం

- బాపట్ల కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో ఈ ఏడాది బ్లాక్‌బర్లీ పొగాకు సాగును పూర్తిగా నిషేధించినట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రయివేట్ బయ్యర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గత సీజన్‌లో డిమాండ్‌కు మించి పంట సాగు చేయడం వల్ల ధరలు గణనీయంగా పడిపోయినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో బ్లాక్‌బర్లీ పొగాకు సాగు చేయరాదని తెలిపారు. నర్సరీల్లోనూ నారు సాగు నిషేధమని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా పంట సాగు చేస్తే వ్యవసాయ శాఖ అధికారులు పంటను ధ్వంసం చేయడంతో పాటు చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ప్రత్యామ్నాయ, లాభదాయక పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఈ పాటికే పండించిన బ్లాక్‌బర్లీ పొగాకును ప్రయివేట్ కంపెనీలకు రైతులు విక్రయించుకోవచ్చునని తెలిపారు.

టిడిపి కూటమి ప్రభుత్వంలో అతిపెద్ద లిక్కర్ స్కామ్

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఈ ఏడాది కాలంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలోని టిడిపి కూటమి ప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద లిక్కర్ స్కామ్‌కు తెర తీసిందని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో రిమాండ్‌లో ఉన్న తన కుమారుడు, ఎంపి మిథున్ రెడ్డిని బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చి, నిత్యం అవినీతి సొమ్ముతో జేబులు నింపుకోవడంలోనే సిఎం చంద్రబాబు నిమగ్నమయ్యారని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసిపి శ్రేణులపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపాలనే లక్ష్యంతోనే పని చేస్తున్నారని విమర్శించారు. వైసిపి హయాంలో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న మద్యం దుకాణాలను తీసేసి, ప్రభుత్వమే వాటిని నిర్వహించిందని, సిఎంగా వైఎస్.జగన్ ఏ డిస్టిలరీలకూ తన పాలనలో కొత్తగా అనుమతులు ఇవ్వలేదని వివరించారు. టిడిపి హయాంలో చంద్రబాబు ఇచ్చిన అనుమతులను పొందిన డిస్టిలరీలే వైసిపి హయాంలోనూ మద్యం సరఫరా చేశాయన్నారు. ఈ ఆర్డర్లు, విక్రయాలు చాలా పారదర్శకంగా జరిగాయని తెలిపారు. ఆయన వెంట మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపి మార్గాని భరత్ తదితరులు ఉన్నారు.

మోహిత్‌రెడ్డి పిటిషన్ విచారణ నుంచి తప్పకున్న జస్టిస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ వై లక్ష్మణరావు తప్పుకున్నారు. మద్యం కేసులో నమోదైన ఎఫ్ఐఆర్‌పై దాఖలైన పిటిషన్లను కూడా విచారణ చేయబోనని వెల్లడించారు. మోహిత్‌రెడ్డి పిటిషన్ ఫైల్ చీఫ్ జస్టిస్ ముందుంచాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. పిటిషన్‌పై వెంటనే విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే సమంలో మోహిత్‌రెడ్డిపై తొందరపాటు చర్యలు తీసుకోరాదన్న గత ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు.

విశాఖలో కాషాయ మూకల దందా!

- రాముడి పేరుతో రూ.కోట్ల వ్యాపారం
- బీచ్ రోడ్డులో వివాదంగా 'అయోధ్య' నమూనా సెట్
- భద్రాచలం దేవస్థానం ఇఒ ఫిర్యాదుతో వెలుగులోకి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో/ ఎంవిపి.కాలనీ

కాదేది వ్యాపారానికి అనర్హం అన్నట్టు విశాఖలో ఏకంగా రాముడి పేరుతో రూ.కోట్ల వ్యాపారానికి కాషాయ మూకలు తెరతీశాయి. దేశంలోని ప్రయాగ్ రాజ్‌లో రాముడి ఆలయానికి యాత్రికుల తాకిడి పెరగడంతో విశాఖలో పామ్ బీచ్‌లోని 91 అడుగుల అయోధ్య రాముడి కోవెల నమూనాను ఏర్పాటు చేసి గత మే 22వ తేదీ నుంచి ప్రజలకు ప్రవేశం కల్పిస్తూ, జంటలతో భద్రాచలంలో ప్రత్యేకంగా పూజలు చేయిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయంపై భద్రాచలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రమాదేవి విశాఖలోని త్రీ టౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదుచేసి అరెస్ట్‌చేశారు. దేవస్థానం అనుమతి లేకుండా, తమకు ఎటువంటి సమాచారమూ ఇవ్వకుండా అసత్య ప్రచారం చేశారని, కల్యాణం పేరుతో ఒక్కో జంట నుండి నిర్వాహకులు రూ.2,999 వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ 30/87 ప్రకారం నియమనిబంధనలకు ఇది విరుద్ధమని, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ ఫిర్యాదులో ఇఒ కోరారు.


విశాఖ బీచ్‌లో ఏర్పాటుచేసిన అయోధ్య రామ మందిరం సెట్

మాట మార్చిన నిర్వాహకులు

ఇఒ ఫిర్యాదుతో ఈ నెల 22న విశాఖలోని మేఘాలయ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆ కరపత్రాలు తాము ముద్రించలేదని, తమపై గిట్టనివారు ముద్రించారని, ఈ ప్రచారంలో వాస్తవం లేదని చెప్పుకొచ్చారు. అయితే, ఈ నెల 29న శ్రీవారి కల్యాణం చేయిస్తున్నామని, దీనికి భద్రాచలం నుండి పండిత పురోహితులను రప్పిస్తున్నామని, అయితే, వారు దేవస్థానం ఆస్థాన పండితులు కారని తెలిపారు. ఈ విషయాన్ని తప్పుగా అర్థం చేసుకున్న భద్రాచలం దేవస్థానం ఇఒ విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. తమపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై తాము కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బిజెపి విశాఖపట్నం కార్యాలయం నుంచే మీడియా కార్యాలయాలకు ఈ వార్తను పంపించారు.

రూ.కోట్లలో ఆదాయం

ఈ నమూనా సెట్‌లోని రాముడిని దర్శించుకోవడానికి సందర్శకుల నుంచి రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. తినుబండారాలకు, కొబ్బరికాయలకు, ఇతర పూజ సామగ్రికి వివిధ స్టాళ్లను ఏర్పాటు చేసి వ్యాపార కేంద్రంగా మార్చేసి వేర్వేరుగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటివరకు సందర్శకుల నుండి, స్టాళ్ల నుంచి అద్దె వసూలు, సామగ్రి అమ్మకాలు, ప్రసాదం కౌంటర్ల ద్వారా వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది.

సంప్రదాయాలకు పాతర..

ఈ గుడి నిర్వహణలో నిర్వాహకులు మతాచారాలకు భిన్నంగా ప్రవర్తిస్తున్నారని పలువురు పురోహితులు, బ్రాహ్మణ సంఘాలు ప్రతినిధులు విమర్శించారు. పూజ చేసిన అనంతరం స్వామికి ప్రసాదం నైవేద్యం పెట్టాల్సి ఉండగా, ఇక్కడ కనీసం పూజ జరగడంలేదని, దీనిని పూర్తి ఒక వ్యాపార కేంద్రంగా మార్చేశారని, ప్రసాదం కౌంటర్ నిర్వహణ బ్రాహ్మణులకు కాకుండా బయటి వారికి అప్పగించారని పలు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

ఈ వివాదంలో మూడు రాష్ట్రాలు

ఈ ఆలయ నమూనా సెట్ కారణంగా మూడు రాష్ట్రాల మధ్య వివాదానికి దారి తీసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఆలయం నమూనా సెట్ నిర్మాణం జరిగితే తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం దేవస్థానం పేరుతో నిర్వాహకులు మోసానికి పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం టెంపుల్ టూరిజం ప్రచారంలో భాగంగా విశాఖలో నిర్మించిన అయోధ్య రామాలయం నమూనా సెట్‌కు సుమారు రూ.కోటి వరకు ఇచ్చినట్టు సమాచారం. ఇక్కడ మూడు నెలలు ప్రదర్శన అనంతరం దీనిని హైదరాబాద్ తరలించేందుకు ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రితో నిర్వాహకులు చర్చలు జరిపారని ప్రచారం జరుగుతోంది. ఈ నమూనాను ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్, పూరీలలో కొంతకాలం ఉంచేందుకు నిర్వాహకులు ప్రణాళికలు రచించారని తెలుస్తోంది.

నడిపిస్తున్న బిజెపి పెద్దలు!

ఈ నమూనా సెట్ ఆలయం వివాదంలో కొందరు బిజెపి నాయకులు వెనుకనుండి చక్రం తిప్పుతున్నారని సమాచారం. ఈ నమూనా సెంటర్ ప్రారంభం రోజున నిర్వహించిన మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్ స్వయంగా పాల్గొని ఇది తమ సారథ్యంలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని ప్రకటించారు. దీంతోపాటు కల్యాణోత్సవంపై చెలరేగిన వివాదాన్ని సద్దుమణిగించేందుకు మంగళవారం విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశాన్ని ఆ పార్టీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ డివిఎస్.వర్మ దగ్గరుండి నడిపించారు. ఈ ఆలయ సెట్ నిర్మాణానికి ఉత్తరాంధ్రకు చెందిన ఒక బిజెపి ఎంపీ భారీ విరాళం ఇచ్చారని, టిడిపి కూటమికి చెందిన కొందరు శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు కూడా భారీగా విరాళాలు అందించారని తెలుస్తోంది.


సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తున్న విసి ఆచార్య జిపి.రాజశేఖర్

ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థుల ధర్నా

- పురుగుల భోజనం పెడుతున్నారని విసి కార్యాలయం వద్ద ఆందోళన

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

పురుగుల భోజనం పెడుతున్నారని ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులు ధర్నాకు దిగారు. మంగళవారం రాత్రి యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో తెల్లవారే వరకూ అక్కడే బస చేసి బుధవారం వైస్‌ఛాన్సలర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. దీంతో ధర్నా వద్దకు వైస్‌ఛాన్సలర్ ఆచార్య జివి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు చేరుకున్నారు. సమస్యలను యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి డి.వెంకటరమణ వివరించారు. గత ఆరు నెలలుగా యూనివర్సిటీ హాస్టళ్లలో భోజనం చాలా అధ్వానంగా ఉంటుందని, ఆహారంలో బొద్దింకలు, పురుగులు ప్రత్యక్షమవుతున్నాయని, యూనివర్సిటీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహారాణి పేట అమ్మాయిల హాస్టల్‌లో పుస్తకాలు, దుస్తులు, మెటీరియల్‌ను ఎలుకలు పాడుచేస్తున్నాయని తెలిపారు. బోటని డిపార్ట్‌మెంట్ దారిలో బయట వ్యక్తులు అమ్మాయిలను ఏడిపిస్తున్నారని, అక్కడ సెక్యూరిటీ పెంచాలని కోరారు. హాస్టల్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కానందున విద్యార్థులపై ఫీజుల భారం పడుతోందని, విద్యార్థులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో లైబ్రరీలను ఆధునీకరించాలని, వర్సిటీలో ఉన్న డిస్పెన్సరీల్లో విద్యారులకు వైద్యం అందించేలా సిబ్బందిని నియమించి, మందులు అందుబాటులో ఉంచాలని, హెల్త్ టెస్టులకు ల్యాబ్ ఏర్పాటు చేయాలని కోరారు. తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించకపోతే కదిలేది లేదని, పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమస్యలపై వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ స్పందిస్తూ.. సమస్యలపై కమిటీ వేశామని, కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని, మిగిలినవి 15 రోజుల గడువుతో పూర్తి చేస్తామని, ప్రతి హాస్టల్‌లో తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ నాయకులు కుసుమాంజలి, అజయ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు అభిషేక్, దిశ నాయకులు అవినాష్, విద్యార్థులు సంజయ్, సోమేష్, హర్ష, వికాస్, ప్రగతి పాల్గొన్నారు.

'సుపరిపాలన..' కు అనూహ్య స్పందన

- మంత్రి వాసంశెట్టి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'సుపరిపాలన-తొలి అడుగు' కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సచివాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'సుపరిపాలన-తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా తాను 9 నియోజకవర్గాల్లో పర్యటించినట్లు చెప్పారు. రాష్ట్రంలో దాదాపు రూ.6 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయని, తద్వారా 10 లక్షల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఐటిశాఖ పరంగా ఇప్పటికే రూ.20 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటితో 50 వేల ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం ఇష్టం లేని ప్రతిపక్ష పార్టీ నాయకులు వాటిని అడ్డుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. అమలాపురంలో కొందరు వ్యక్తులు ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బు వసూలు చేసి మోసగించిన సంఘటనలో తనకు ఏమాత్రం ప్రమేయం లేదని, వారు తన అనుయాయులు కాదని చెప్పారు.

బ్యాంకు ఖాతాలు ఎన్‌సిపిఐ మ్యాపింగ్

- వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) మ్యాపింగ్‌లో బ్యాంకు ఖాతా నమోదు అవ్వని 'అన్నదాతా సుఖీభవ' లబ్ధిదారులు తక్షణమే నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. లబ్ధిదారుల్లో 44,995 మంది బ్యాంకు ఖాతాల వివరాలు ఎన్‌సిపిఐలో నమోదు కాలేదని, 76,705 మంది బ్యాంకు ఖాతాల్లో గత కొంత కాలంగా ఎటువంటి లవాదేవీలు జరగకుండా నిస్తేజంగా ఉన్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ఇ-కెవైసి పూర్తి చేసుకున్న లబ్ధిదారులు 47,41,792 మంది రైతుల వివరాలను ఆర్‌టిజిఎస్, ఎన్‌సిపిఐ సంయుక్తంగా పరిశీలించినట్లు వెల్లడించారు. ఎన్‌సిపిఐలో నమోదుకాని బ్యాంకు ఖాతాలు, లావాదేవీలు జరపని బ్యాంకు ఖాతాల రైతుల వివరాలు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారన్నారు. రైతులు వారి బ్యాంకు ఖాతాల స్థితిని తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి రైతుల్లో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్వారీ రద్దు చేయాలంటూ దళితుల నిరసన దీక్ష

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం జి.కోడూరులో ఉన్న రాళ్ల క్వారీని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ దళిత రైతులు, దళిత సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన బుధవారం నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ముందుగా బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దళిత రైతులకు న్యాయం చేయండి అంటూ ప్లకార్డులతో నిరసన తెలియజేశారు.

ఈ సందర్భంగా దళిత, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ... జి.కోడూరు సర్వే నెంబర్ 332లో నిర్వహిస్తున్న రాళ్ల క్వారీ వల్ల స్థానిక రైతులు, ముఖ్యంగా దళిత సామాజిక తరగతులకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. క్వారీ కార్యకలాపాల వల్ల పరిసర ప్రాంతాల్లో గాలి, శబ్ద కాలుష్యం, నీటి వనరుల కలుషితం అవుతున్నాయని, ఈ కారణంగా వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తూ క్వారీ కార్యకలాపాలు సాగుతున్నాయని విమర్శించారు. స్థానిక రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా క్వారీని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని, సమస్యలు పరిష్కరించని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ దీక్షకు సిపిఎం నాయకులు చిరంజీవి, బిఎస్‌పి నాయకులు బొట్టా నాగరాజు, కాంగ్రెస్ జిల్లా ఒబిసి చైర్మన్ బొంతు రమణ, వైసిపి మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు మట్ల చంటి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాలు నాయకులు అప్పారావు, గణేష్, పెంటయ్య, లక్ష్మి, లవరాజు తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద దీక్ష చేపట్టిన దళిత రైతులు



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఏకపక్షంగా విభాగాల మార్పు తగదు

- స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు అయోధ్యరామ్

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులను విభాగాలుగా మార్చడం, కాంట్రాక్టు కార్మికులను తొలగించడం, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను ఉపసంహరించుకుంటూ నిర్ణయాలు చేయడం తదితర అంశాలపై యాజమాన్యం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట స్టీల్‌ప్లాంట్ కార్మికులు, యూనియన్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ.. ఒప్పందాలను, కార్మిక హక్కులను యాజమాన్యం కాలరాస్తోందని విమర్శించారు. కార్మికుల విభాగాలుగా మార్చాలంటే వారితో చర్చించాలనే కనీస అవగాహన లేకుండా రాత్రికి రాత్రే మార్చడం యాజమాన్య ఏకపక్ష నిర్ణయానికి నిదర్శనమన్నారు. హెచ్‌ఆర్ఎ చెల్లింపు, కరెంటు ఛార్జీల భారంపై నేటికీ దృష్టి సారించడం లేదన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ... ప్లాంట్‌లో ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేట్ వారికి అప్పగించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. దీనికి గుర్తింపు యూనియన్ సహకరిస్తోందన్నారు. దీంతో, కార్మిక ప్రయోజనాలు, కర్మాగార రక్షణ ప్రశ్నార్థకం అవుతాయని వివరించారు. ఈ చర్యలను తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు టివికె.రాజు, బి.తౌడన్న, కె.గంగాధర్, పుల్లారావు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు రైతులు మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి,రేగిడి

పిడుగుపాటుకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఇద్దరు రైతులు బుధవారం మరణించారు. తోటి కార్మికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలోని దుప్పిలిపాడు గ్రామానికి చెందిన రైతు బొక్కరి వీరాస్వామి (42) తన పొలంలో గట్టు వేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో వీరస్వామికి సమీపంలో పిడుగు పడడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గమనించిన తోటి రైతులు ఆస్పత్రికి తరలించే లోపే వీరాస్వామి మరణించారు. ఆయనకు భార్య శాంతి, కుమారుడు జశ్వంత్, కుమార్తె జోత్స్న ఉన్నారు.

విజయనగరం జిల్లా రేగిడి మండలంలోని వెంకట రంగరాయపురం (జాడపేట)కు చెందిన రైతు ఆలబోయిన శ్రీనివాసరావు (45) తన పొలంలో వరినారు తీస్తుండగా ఒక్కసారిగా ఉరుములతో కూడిన పిడుగు వారికి సమీపంలో పడింది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మరణించారు. తోటి కార్మికుడు పాంద్రంకి బంగారయ్య అస్వస్థతకు గురయ్యారు. వారికి ప్రథమ చికిత్స చేసి అనంతరం రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాసరావుకు భార్య నీలవేణి, కుమారులు గంగరాజు, వెంకటరమణ ఉన్నారు.

మింత్రాపై ఇడి కొరడా

- ఎఫ్‌డిఐ నిబంధనల ఉల్లంఘన ఎఫెక్ట్



న్యూఢిల్లీ : ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన మింత్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఫారిన్ ఎక్స్ఛేంజీ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) కింద కేసు నమోదు చేసింది. ఎఫ్‌డిఐ నిబంధనలు ఉల్లంఘించి రూ.1,654.35 కోట్ల అవకతవకలకు పాల్పడిందని ప్రధాన ఆరోపణ. మింత్రా, హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ ముసుగులో మల్టీ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్ నిర్వహిస్తూ, విదేశీ పెట్టుబడులు స్వీకరించింది. తమ ఉత్పత్తులను వెక్టర్ ఇ-కామర్స్ అనే అనుబంధ సంస్థకు 100 శాతం విక్రయించి.. ఆ సంస్థ ద్వారా రిటైల్ కస్టమర్లకు చేరేలా చేసింది. ఎఫ్‌డిఐ నిబంధనల ప్రకారం 25 శాతం లోపే గ్రూప్ కంపెనీలకు విక్రయించాలనే నిబంధనను ఉల్లంఘించడమేనని ఇడి తెలిపింది.

హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ అంటే ఉత్పత్తులను రిటైలర్లకు లేదా ఇతర వ్యాపార సంస్థలకు హోల్‌సేల్‌గా విక్రయించొచ్చు. వినియోగదారులకు నేరుగా విక్రయాలు జరపకూడదు. ఒకే గ్రూప్‌నకు చెందిన సంస్థకు ఇలా పూర్తి విక్రయాలు జరపడం ఫెమా నిబంధనలు ఉల్లంఘించడం కిందకు వస్తుందని గుర్తించి ఇడి కేసు నమోదు చేసింది. ఈ కేసులో మింత్రాతో పాటు అనుబంధ సంస్థలు, డైరెక్టర్లపై ఇడి అభియోగాలు మోపింది.

ఎస్‌బిఐ కార్డ్ - ఫోన్ పే క్రెడిట్ కార్డ్ ఆవిష్కరణ



న్యూఢిల్లీ : ప్రముఖ క్రెడిట్ కార్డ్ జారీదారు ఎస్‌బిఐ కార్డ్, ఫోన్‌పే భాగస్వామ్యంతో బుధవారం ఫోన్‌పే ఎస్‌బిఐ కార్డును విడుదల చేసింది. రెండు వేరియంట్లలో పర్పుల్, సెలెక్ట్ బ్లాక్‌లో లభ్యమయ్యే ఈ కాంటాక్ట్‌లెస్ కార్డ్‌లు రూపే, వీసా నెట్‌వర్క్‌లపై అందుబాటులో ఉంటాయని తెలిపింది. వీటితో ఫోన్‌పే యాప్ లావాదేవీలపై గరిష్టంగా 10 శాతం, ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై 5 శాతం రివార్డ్ పాయింట్లను పొందవచ్చని ఎస్‌బిఐ కార్డ్ సిఇఒ సలీల్ పాండే పేర్కొన్నారు. ఈ కార్డ్ డిజిటల్ చెల్లింపులను సరళీకరిస్తూ, వినియోగదారుల ఆర్థిక ఆకాంక్షలను నెరవేరుస్తుందని ఫోన్ పే సిఇఒ సమీర్ నిగం తెలిపారు.

ఆఫర్ లెటర్లు ఇచ్చి.. ఉద్యోగాలివ్వడం లేదు

- టిసిఎస్‌పై కేంద్రానికి ఉద్యోగుల ఫిర్యాదు

న్యూఢిల్లీ : దేశంలోని అతిపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) వందలాది మందికి ఆఫర్ లేటర్లు ఇచ్చి.. ఉద్యోగాలు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేస్తోంది. 600 మందికి పైగా అనుభవజ్ఞులైన ఉద్యోగుల లేటరల్ నియామకాల్లో టిసిఎస్ ఆలస్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ (ఎన్ఐటిఇఎస్) జులై 22న కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు లేఖ రాసింది. ఈ ఆన్‌బోర్డింగ్ టైమ్‌లైన్‌పై ఎటువంటి కమ్యూనికేషన్ లేదని, దీంతో చాలా మంది టెక్కీలు ఇబ్బంది పడుతున్నారని మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లింది. జాప్యానికి తగిన ఆర్థికపరిహారం కూడా ఇప్పించాలని డిమాండ్ చేసింది. ఈ అంశంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో బెంగళూరు, హైదరాబాద్, పూణె, కోల్‌కతా, ముంబయి, ఢిల్లీ ప్రాంతాలకు టెకీలు ఉన్నారు. వీరికి 2-8 ఏళ్ల మధ్య అనుభవం ఉంది. సదరు అభ్యర్థులు తమ పాత ఉద్యోగాలకు రాజీనామా లేఖలను సమర్పించారు. అయితే తాము ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని టిసిఎస్ పేర్కొంది. అది ఫ్రెషర్స్ అయినా.. అనుభవజ్ఞులైనా. టిసిఎస్ నుంచి ఆఫర్ లెటర్ అందుకొన్న ప్రతిఒక్కరూ కంపెనీలో ఉంటారని తెలిపింది.

డాక్టర్ రెడ్డీస్ లాభాల్లో స్వల్ప పెరుగుదల

హైదరాబాద్ : దిగ్గజ ఫార్మా ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 1.4 శాతం పెరుగుదలతో రూ.1,409 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,392 కోట్ల లాభాలను నమోదు చేసింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ రూ.7,696 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ1లో 11.3 శాతం పెరిగి రూ.8,572 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 15.8 శాతం పెరిగి రూ.6,957 కోట్లుగా చోటు చేసుకుంది.

సెన్సెక్స్ 540 పాయింట్ల పెరుగుదల

ముంబయి : బ్యాంక్, ఆటో షేర్ల మద్దతుతో బుధవారం భారత మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అమెరికా, జపాన్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడంతో ఆసియా సహా, ఇతర మార్కెట్లూ రాణించాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 539.83 పాయింట్లు లేదా 0.66 శాతం పెరిగి 82,726కు చేరింది. ఎన్‌ఎస్ఇ నిఫ్టీ 159 పాయింట్లు లేదా 0.63 శాతం రాణించి 25,219 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు అధికంగా లాభపడ్డాయి.

జూన్‌లో స్థిరత్వం : పిఎల్ అసెట్ మేనేజ్‌మెంట్

గడిచిన జూన్‌లో భారత మార్కెట్లు స్థిరత్వాన్ని ప్రదర్శించాయని పిఎల్ ఆసెట్ మేనేజ్‌మెంట్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదలతో నెల మధ్యలో అస్థిరత ఉన్నప్పటికీ, బలమైన దేశీయ స్థూల ఆర్థిక ప్రమాణాలు, పెట్టుబడిదారుల విశ్వాసం మెరుగుదల కారణంగా భారత ఈక్విటీ మార్కెట్లు స్థిరంగా నిలిచాయని తెలిపింది.

స్మాల్ క్యాప్ 250 ఇండెక్స్ 5.73 శాతం పెరగ్గా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 4.1 శాతం లాభపడిందని పిఎల్ అసెట్ మేనేజ్‌మెంట్ ఫండ్ మేనేజర్ సిద్ధార్థ్ వోరా పేర్కొన్నారు. అస్థిర ఎఫ్ఐఐ ఫ్లోలు, టారిఫ్ అనిశ్చితులు, వాతావరణ ఫలితాలు రాబోయే సమయంలో గమనించవల్సిన కీలక అంశాలన్నారు.

బోటు బోల్తాపడి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి


గజేంద్ర (ఫైల్)

శ్రీకాకుళం జిల్లా గార మండలం బందరువానిపేట వద్ద సముద్రంలో బోటు బోల్తా పడి అదే గ్రామానికి చెందిన మత్స్యకారుడు బడి గజేంద్ర (55) బుధవారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఐదుగురు మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్న క్రమంలో అలల తాకిడికి ఒక్కసారిగా బోటు తిరగబడింది. దీంతో అందరూ సముద్రంలో పడిపోయారు. నలుగురు బోటును పట్టుకుని ప్రాణాలను కాపాడుకోగా, బోటుకు దూరంగా గజేంద్ర పడిపోయారు. మిగిలిన వారు రక్షించే ప్రయత్నం చేసినా అప్పటికే ఆయన చనిపోయారు. గజేంద్రకు భార్య పోలమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు భరోసానిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. ఐదు లక్షలు, మత్స్యశాఖ నుంచి రూ. ఐదు లక్షలు పరిహారం ప్రకటించినట్లు మంత్రి తెలిపారు.

బెనిఫిట్ షో విధానాన్ని నిలిపేయాలి

- పెంచిన టికెట్ ధరలు తగ్గించాలి
- డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బెనిఫిట్ షోల పేరుతో ప్రేక్షకులను దోపిడీ చేసే విధానాన్ని అదుపు చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. హరిహర వీరమల్లు సినిమా విడుదలకు ఒక్కరోజు ముందు బెనిఫిట్ షో పేరుతో రూ.700 నుంచి రూ.1000 వసూళ్లు చేయడం దారుణమని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రేక్షకులను దోపిడీ చేసే ఈ విధానాన్ని అదుపు చేయాలని డిమాండ్ చేశారు.

గతంలో హైదరాబాద్ నగరంలో బెనిఫిట్ షో కారణంగా ఒక కుటుంబం ఛిద్రమైన పరిస్థితిని ప్రభుత్వం గుర్తుచేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హరిహర వీరమల్లు సినిమా కోసం టికెట్ ధరలు పెంచుతూ విడుదల చేసిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టికెట్ ధరలు రూ.177 నుంచి రూ.377 వరకు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి నటించిన సినిమా ఇలా సామాన్యులను దోచుకోవడం సరైంది కాదని, దీనికి ప్రభుత్వం వత్తాసు పలకడం సిగ్గుచేటని విమర్శించారు. సామాన్యులకు అన్నింటా అధిక ధరలతో చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వం చివరికి వినోదం కోసం సినిమా వీక్షించేందుకు థియేటర్లకు వెళ్లినా వదలడం లేదని పేర్కొన్నారు. ప్రజలు అనేక సమస్యల ఒత్తిడితో వినోదం కోసం, ఆనందం కోసం సినిమా థియేటర్‌కు వస్తే ఇక్కడ వినోదానికి బదులు విషాదం మిగుల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రేక్షకులకు సినిమా టికెట్ ధరలు అందుబాబులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు.

బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి, సినిమా థియేటర్లలో కనీస సౌకర్యాలు కల్పించకుండా నిర్వహిస్తున్న యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్కింగ్ ఛార్జీలు వసూలు చేసే థియేటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యవేక్షించే అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సామాన్యుడికి వినోదం అందించే స్థాయి నుంచి వారి జేబుకు చిల్లు పెట్టే స్థాయికి సినిమా వచ్చిందని పేర్కొన్నారు. దీనివల్ల యువత అధికంగా నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే ఈ అంశాలపై జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంజి ఎం9 ఎలక్ట్రిక్ లిమౌసిన్ విడుదల

న్యూఢిల్లీ : జెఎస్‌డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా తమ ఎంజి ఎం9 ది ప్రెసిడెన్షియల్ లిమౌసిన్‌ను విడుదల చేసింది. ఈ ఎలక్ట్రిక్ ఎంపివి ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.69.90 లక్షలుగా నిర్ణయించింది. రూ.1 లక్ష చెల్లించి ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని ఆ కంపెనీ తెలిపింది. ఆగస్టు 10 నుంచి డెలివరీలు ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. ఎన్‌సిఎపి నుంచి 5 స్టార్ రేటింగ్ కలిగిన ఈ వాహనాన్ని ఒక్క సారి ఛార్జింగ్ చేస్తే 548 కిలోమీటర్లు ప్రయాణించగలదని తెలిపింది.

సంపాదకీయం

'కుబేర' కుంభకోణం

నిరుపేదలను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపి బ్యాంకు నుంచి కోట్లు కొల్లగొట్టిన 'కుబేర' తరహా మోసానికి నెల్లూరు కేంద్రం కావడం దిగ్భ్రాంతికరం. నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలుతో సర్కారు అండతోనే బ్యాంకులను దోచుకునే స్కీమ్‌లు, స్కామ్‌లు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసేసి, నిరుపేదలను ఉద్యోగులుగా చూపించి, వారికి ఏమాత్రం అనుమానం రాకుండా నెలకు లక్ష రూపాయల వరకూ జీతం వస్తున్నట్టు పత్రాలు సృష్టించి కోట్లు స్వాహా చేస్తున్నారు. బ్యాంకుల నుంచి కోట్లు దోచుకుంటున్న అక్రమార్కులకు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, కొందరు పెద్దలు అందిస్తున్న అండదండలు ఇటువంటి ఆర్థిక నేరాలకు ఊతమిస్తున్నాయి.

యాక్సిస్ బ్యాంకు కేంద్రంగా చోటుచేసుకున్న ఈ కుంభకోణంలో అమాయకులైన దళితులు, గిరిజనులకు రుణాలిప్పిస్తామంటూ జాలే వాసుదేవ నాయుడు, అధికార పార్టీ మాజీ మైనారిటీ సెల్ నాయకుడు అల్లాభక్షుసహా నలుగురు మోసగించినట్టు ప్రాథమిక సమాచారం. బ్యాంకు మేనేజర్ ఏడు నెలల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రజాశక్తి కథనం వెలుగులోకి వచ్చే వరకూ బ్యాంకు ఉన్నతాధికారులు గాని, పోలీసులు గాని స్పందించకపోవడం పెద్ద తలకాయల పాత్రను స్పష్టం చేస్తోంది. తొలుత 56 మందిని మోసగించి, రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు స్కామ్ చేశారని భావించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం వందల కోట్లు దాటిందనే కథనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగానూ, సరిహద్దు రాష్ట్రాల్లోనూ ఏజెంట్లను పెట్టుకుని... గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక అవసరాలున్న పేదలను గుర్తించి, రుణాలిప్పిస్తామంటూ వారి ఆధార్, వేలిముద్రలు, ఇతర వివరాలు సేకరించి కోట్లు కొల్లగొట్టారంటేనే ఈ కుంభకోణం లోతు అర్థమవుతోంది. కుబేర చిత్రంలో బిచ్చగాళ్లను మోసగించినట్టు చూపితే... ఇక్కడ దళితులు, గిరిజనులు ఇతర అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకున్నారు. వాసుదేవనాయుడు తన కార్యాలయంలో పనిచేసిన దళిత మహిళ పేరుతో చెన్నై, నెల్లూరు, విశాఖలో కలిపి కోటి రూపాయల వరకూ రుణం తీసుకున్నాడంటేనే దేశవ్యాప్తంగా విస్తరించిన అక్రమ లావాదేవీలు అర్థమవుతున్నాయి. ఆధునీకరణలో భాగంగా తీసుకొచ్చిన ఆన్‌లైన్ విధానంలోని లోపాలను బ్యాంకు సిబ్బంది సహకారంతోనే ఇదంతా చోటుచేసుకుందనే విమర్శలూ ఉన్నాయి. బ్యాంకు సిబ్బంది ఏ ఒక్క లబ్ధిదారుడి రికార్డులనూ సక్రమంగా పరిశీలించలేదని, నేరుగా మాట్లాడటం, కలవడం చేయలేదంటేనే వారి పాత్ర కూడా ఉందని స్పష్టమవుతోంది. బ్యాంకుకు కూడా వెళ్లకుండానే అప్పు ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తున్న నిరక్షరాస్యులైన పేదలకు ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత బ్యాంకు వర్గాలదే. ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించి రుణాలకు అర్హులని తేలడంతో ఇచ్చేశామని కాకమ్మ కథలు చెప్పడం చెల్లదు. రేపోమాపో అప్పు వస్తుందని ఎదురుచూస్తున్న నిజమైన లబ్ధిదారులు ఏకంగా నోటీసులే అందడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు.

దేశంలో 2 జి స్పెక్ట్రమ్, నీరవ్ మోడీ, సహారా ఇండియా తరహా మోసాలు, బ్యాంకుల నుంచి అప్పు తీసుకుని ఎగ్గొట్టడాలు, ఆ తరువాత వాటిని కేంద్రంలో ఉన్న పెద్దలు మాఫీ చేయడాలు గతంలో చూశాం. విదేశాలు కేంద్రంగా సైబర్ మోసాలు ఇటీవలి కాలంలో తరచూ వెలుగుచూస్తున్నాయి. ఇప్పుడు నిరక్షరాస్యులు, నిరుపేదలు, అట్టడుగు వర్గాలు లక్ష్యంగా మోసాలకు పాల్పడటం దేశంలో చోటుచేసుకుంటున్న నేరాల నియంత్రణలో కేంద్రం వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. నయా ఉదారవాద విధానాలను ఆకాశానికెత్తుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కుంభకోణాలపై మూగనోము పాటించడం నేరాలకు సహకరించడమే. బ్యాంక్‌లు, బ్యాంకింగేతర సంస్థల్లో లక్షలాది మోసపూరిత ఖాతాలు పెరగడంపై ఆర్‌బిఐ తరచూ ఆందోళన వ్యక్తం చేయడం మినహా కార్యాచరణ లేకపోవడం ప్రమాదకరం. బాధితులకు రక్షణ కల్పించడంతోపాటు న్యాయం చేయాలి. స్కామ్‌లో పాత్రధారులతోపాటు సూత్రధారులను కఠినంగా శిక్షించాలి. స్కామ్‌కు పాల్పడిన వారితోపాటు సహకరించిన వారందరిపైనా చర్యలు తీసుకోవాలి. భవిష్యత్‌లో ఈ తరహా స్కామ్‌లు జరగకుండా చూడాలి.

మహనీయుల మాట



గుణం లేనివాడు
కులం గొడుగు పడతాడు.
మానవత్వం లేనివాడు
మతం ముసుగు వేస్తాడు.
పస లేని వాడు
ప్రాంతం ఊసెత్తుతాడు.
జనులంతా ఒక కుటుంబం.
జగమంతా ఒక నిలయం.

- గుర్రం జాషువా

జననం : 28.9.1895
మరణం : 24.7.1971

ఏడాది కూటమి పాలన - రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

విశ్లేషణ



రాష్ట్ర సొంత ఆదాయంలో 90 శాతం ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, వడ్డీలకే సరిపోతున్నదని, గత ప్రభుత్వం వల్లే ఈ దుస్థితి వచ్చిందని ప్రచారం చేస్తూ ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలుకు నిరాకరిస్తున్నది. సూపర్ సిక్స్ పథకాలలో మహిళలకు ఉచిత బస్సు, మహిళా నిధి, నిరుద్యోగ భృతి వంటివి నేటికీ అమలు చేయలేదు. గత ఏడాది తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలు కూడా అమలు చేయలేదు. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదు. లక్షల సంఖ్యలో ఉన్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, స్కీమ్ వర్కర్ల వేతనాలు పెంచడంలేదు. కార్మికుల కనీస వేతనాలు పెంచకుండా శత్రుపూరిత వైఖరి అనుసరిస్తున్నది. ఆఖరికి పొగాకు, మిర్చి, మామిడి, పత్తి, పామాయిల్ వంటి అనేక పంటల ధరలు దారుణంగా పడిపోయాయి. రైతులను ఆదుకోవడానికి కనీస మద్దతు ధర ప్రకటించి వాటి కొనుగోలుకు అవసరమైన నిధులు ఇవ్వటానికి కూడా ఈ ప్రభుత్వం ముందుకు రావటం లేదు. కేంద్రంపై వత్తిడి కూడా చేయడంలేదు.

తెలుగుదేశం-జనసేన-బిజెపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. గత వైసిపి ప్రభుత్వ ఆర్థిక అరాచక పరిస్థితి నుండి రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నట్లు చంద్రబాబు ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తున్నది. రెండోవైపు తరచూ పన్నుల వసూళ్ల శాఖలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ పన్ను రాబడి పెంచాలని టార్గెట్లు ఇస్తూ ప్రజల మీదకి వదులుతున్నారు. అయినా ఈ త్రైమాసికంలో మొత్తం రూ. 69,984 కోట్ల వ్యయానికిగాను వచ్చిన మొత్తం ఆదాయం రూ. 36,239 కోట్లు మాత్రమే. వచ్చిన ఆదాయం చేసిన ఖర్చుకు సరిపోక పోవడంతో రూ. 37,097 కోట్లు అప్పులు తీసుకొచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025 - 26)లో మొత్తం రూ. 79926 కోట్లు అప్పులు తీసుకోవాలని బడ్జెట్‌లో అంచనా వేశారు. మొదటి ఏప్రిల్ - జూన్ మూడు నెలలకే 46 శాతం అప్పు తీసుకొచ్చారు. మిగిలిన తొమ్మిది నెలల్లో ఎంత అప్పు తీసుకు రావాల్సి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దీనిని బట్టి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో తెలుస్తున్నది.



డా॥ బి. గంగారావు

2024 - 25 బడ్జెట్‌లో రూ. 2.94 లక్షల కోట్లు ఆదాయాన్ని ప్రతిపాదించారు. ఇందులో అప్పులు మినహా రూ. 2.01 లక్షల కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. కానీ రూ. 1.68 లక్షల కోట్లు (83 శాతం) మాత్రమే వచ్చింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే సుమారు రూ. 16 వేల కోట్లు ఆదాయం తగ్గింది.

రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర సొంత పన్నుల ద్వారా వచ్చే ఆదాయం అత్యంత ముఖ్యమైనది. ఇందులో రాష్ట్ర జీఎస్టీ, అమ్మకపు పన్ను, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చార్జీలు, ఎక్సైజ్ డ్యూటీ, రవాణా పన్నుతో పాటు పన్నేతర ఆదాయాలు ఉంటాయి. గత ఏడాది మొత్తంగా రాష్ట్రానికి తన పరిధిలో రూ. 1,11,439 కోట్లు సొంత ఆదాయం వచ్చింది. కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో రాష్ట్ర వాటాగా రూ.36,869 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల గ్రాంట్లు రూ. 20135 కోట్లు రాష్ట్రానికి చేకూరింది. ఇవి చాలక బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్న రూ. 68372 కోట్లు మించి రూ. 81,597 కోట్లు అప్పులు తీసుకోవాల్సి వచ్చింది. ఇబ్బడి ముబ్బడిగా అప్పులు తీసుకు రావటంలో గత వైసిపి ప్రభుత్వం, నేటి తెలుగు దేశం కూటమి ప్రభుత్వం మధ్య ఎలాంటి తేడా లేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసిపి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన కూటమి పార్టీలు నేడు అప్పుల కోసం వెంపర్లాడటమే కాక అప్పుల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కూడా ఫణంగా పెట్టటానికి వెనుకాడటం లేదు.

వృద్ధి రేటును, రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలను రాష్ట్ర అభివృద్ధికి చిహ్నాలుగా పదేపదే ప్రచారం చేస్తున్నది. ప్రస్తుత 2025 - 26 సంవత్సరం 14 శాతం వృద్ధి రేటుతో మొత్తం రూ.18.3 లక్షల కోట్లకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి చేరుకుంటుందని అంచనా వేశారు. వాస్తవంగా రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుదలకు లేదా రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల లేదా ఉత్పత్తి పరిమాణానికి అనుగుణంగా రాష్ట్ర పన్నుల ఆదాయంలో పెరుగుదల లేదు. దీనికి ఒక ముఖ్యమైన కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున కార్పొరేట్ శక్తులకు పన్నులు, ఇతర అనేక రూపాల్లో రాయితీలివ్వడం వల్ల స్థూల ఉత్పత్తి పెరిగినా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం దానికి అనుగుణంగా పెరగడం లేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భారీగా జీఎస్టీ, అమ్మకపు పన్ను, విద్యుత్ చార్జీలు వంటి అనేక పన్నుల రాయితీలు బడా పెట్టుబడులకు ఇస్తున్నది. గత వైసిపి ప్రభుత్వం కూడా ఇచ్చింది. వివిధ పేర్లతో వేల కోట్లు విలువ చేసే ప్రభుత్వ, రైతుల భూములను కూడా ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేసి ప్రైవేట్ పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నది. కానీ భూబదలాయింపుకు పెట్టుబడిదారులు చెల్లించాల్సిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చార్జీలు, నాలా వంటి చార్జీలను కూడా ప్రభుత్వం మినహాయిస్తున్నది. ఈ సంస్థలకు రోడ్లు, రైల్వే లైన్ల అనుసంధానం, విద్యుత్, మంచినీరు సదుపాయం కొరకు రాష్ట్ర ప్రభుత్వమే తన బడ్జెట్ ఆదాయం నుండి వేల కోట్లు ఖర్చు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నది. ఇవిగాక ఉత్పత్తి ప్రోత్సాహకాలు పేర కూడా ఎదురు నిధులను పెట్టుబడిదారులకు ఇస్తున్నది. ఫలితంగా రాష్ట్ర ఖజానా వేల కోట్లు పన్నుల ఆదాయం కోల్పోతున్నది. మైనింగ్ విచ్చలవిడి దోపిడీతో వేల కోట్లు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది.

ప్రభుత్వ అభివృద్ధి వ్యూహం మొత్తం ప్రైవేట్ పెట్టుబడుల ప్రయోజనాలు చుట్టూ ఉంది. నిధుల వినియోగంలో ప్రజాదృక్పథం లేదు. ఈ ఆర్థిక నమూనా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచకపోగా పెద్ద ఎత్తున ప్రభుత్వ ఖజానా నిధులు, సహజ వనరులు, ప్రజా ఆస్తులు, సదుపాయాలు, మౌలిక సదుపాయాలను పెట్టుబడిదారుల పరం చేస్తున్నది. రాష్ట్రాన్ని మరింతగా అప్పుల ఊబిలోకి దించుతున్నది. నిరుద్యోగం, అసమానతలు పెంచుతున్నది. ఈ విధానం రాష్ట్రానికి, ప్రజలకు అత్యంత ప్రమాదకరంగా మారింది.

సామాన్య ప్రజల నుండి మాత్రం ముక్కు పిండి పన్నులు వసూలు చేయడం, పన్నులు పెంచడం చేస్తుంది. ఈ ఏడాది ఏకంగా మద్యం ద్వారా రూ. 27097 కోట్లు రాబట్టాలని నిర్ణయించింది. మొత్తంగా ఈ ఏడాది అదనంగా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.17 వేల కోట్లు రాబట్టాలని నిర్ణయించింది. ఒక వైపు వేల కోట్లు బడా పెట్టుబడిదారులకు పన్ను రాయితీలతో పాటు ఖజానా నుండి వేల కోట్లు నిధులను వీరి ప్రయోజనాలకు ధారాదత్తం చేస్తూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై రకరకాల పన్ను భారాలు మోపుతూ ప్రజల కష్టార్జితాన్ని లూటీ చేస్తున్నది. రూ.17 వేల కోట్లకు పైగా విద్యుత్ చార్జీల భారాన్ని కూడా ఈ ఏడాది కాలంలోనే మోపింది.

కేంద్ర బిజెపి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీపై ఆధారపడి ఉంది. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర బిజెపి కి మద్దతు ఇస్తున్నామని చంద్రబాబు చెబుతున్నారు. గత ఏడాది కాలంలో రాష్ట్రానికి అదనంగా ఒక్క రూపాయి కూడా కేంద్ర ప్రభుత్వం నిధులివ్వలేదు. రాష్ట్ర రెవెన్యూ లోటు భర్తీ కూడా నిలిపేసింది. విభజన చట్టంలో పేర్కొన్న రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలన్నింటిని దెబ్బతీసింది.

కేంద్ర పన్నుల నుండి రాష్ట్రానికి 15వ ఆర్థిక సంఘం ప్రకారం 41 శాతం వాటా నిధులు రావాలి. కానీ 30 శాతం కూడా గత ఏడాది ఇవ్వలేదు. 2023-24లో రూ.45711 కోట్లు ఇవ్వగా 2024-25లో రూ.36869 కోట్లకు కోత పెట్టారు. కేంద్ర ప్రాయోజిత పథకాల గ్రాంట్లు చూస్తే ఇదే కాలంలో రూ. 34,698 కోట్ల నుండి 20,135 కోట్లకు దిగ కోశారు. గడిచిన ఏప్రిల్ - జూన్ మూడు నెలల్లో కేంద్రం నుంచి వచ్చిన నిధులను చూసినా గత ఏడాదికి భిన్నంగా లేదు. కేంద్ర పన్నులలో రాష్ట్ర వాటా కింద రూ. 8443 కోట్లు, గ్రాంట్ల కింద అయితే అత్యంత దారుణంగా కేవలం రూ.1465 కోట్లు మాత్రమే ఇచ్చింది. గత పదేళ్లలో కేంద్ర పన్నుల నుండి రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సిన నిధుల్లో ఆంధ్ర రాష్ట్ర వాటా 5 శాతం నుండి 4.04 శాతానికి పడిపోయింది.


కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రం ఎడల ప్రదర్శిస్తున్న దారుణమైన నిధుల వివక్షతపై తెలుగుదేశం కూటమి కనీసం పన్నెత్తి మాట మాట్లాడటంలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్ప ఏ మాత్రం వత్తిడి చేయడం లేదు. అమరావతి రాజధాని నిర్మాణానికి మొదటి దశలో రుణ రూపంలో ఇచ్చిన నిధులను రెండో దశలో కనీసం గ్రాంట్ల రూపంలో ఇవ్వాలని ఆర్థిక మంత్రిని ప్రాధేయపడినా నిర్మలా సీతారామన్ నుండి కనీస స్పందన లేదు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వడ్డీ లేని రుణాలను కనీసం ఈ ఏడాది రూ.10 వేల కోట్లు ఇవ్వాలని మోడీ ప్రభుత్వాన్ని కోరుతున్నది. ఈ నిధులు అత్యంత ప్రమాదకరమైనవి. ప్రైవేటీకరణ సంస్కరణలకు ముడి పెట్టి ఇచ్చే రుణాలివి. గత వైసీపీ ప్రభుత్వం ఈ రుణాలు తీసుకొని విద్యుత్ సంస్కరణలు, కార్మిక చట్టాలలో మార్పులు, ఆస్తి పన్నును ఆస్తి విలువకు ముడిపెట్టి పెంచడం, భూ సర్వే, భూ రికార్డులు డిజిటలైజేషన్, ఒకే కార్డు ఇలా అనేక ప్రజా హానికర విధానాలు అమలులోకి తీసుకొచ్చి ప్రజలపై భారాలు మోపిన విషయం తెలిసిందే. వీటిని ప్రతిపక్షంలో వుండగా తెలుగుదేశం పార్టీ తీవ్రంగా విమర్శించింది. అధికారం చేపట్టాక విషమ షరతుల అమలుకు చంద్రబాబు ప్రభుత్వం పూనుకుంటున్నది. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను గత వైసిపి ప్రభుత్వం గుడ్డిగా అమలుచేసి ప్రజా వ్యతిరేకతను కొని తెచ్చుకుంది. అదే దారిలో టిడిపి కూటమి ప్రభుత్వం మరింత దూకుడుగా వెళ్తోంది.

ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చులు పెరిగి పోతున్నాయని వాపోతున్నది. రాష్ట్ర సొంత ఆదాయంలో 90 శాతం ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, వడ్డీలకే సరిపోతున్నదని, గత ప్రభుత్వం వల్లే ఈ దుస్థితి వచ్చిందని ప్రచారం చేస్తూ ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలుకు నిరాకరిస్తున్నది. సూపర్ సిక్స్ పథకాలలో మహిళలకు ఉచిత బస్సు, మహిళా నిధి, నిరుద్యోగ భృతి వంటివి నేటికీ అమలు చేయలేదు. గత ఏడాది తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలు కూడా అమలు చేయలేదు. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదు. లక్షల సంఖ్యలో ఉన్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, స్కీమ్ వర్కర్ల వేతనాలు పెంచడంలేదు. కార్మికుల కనీస వేతనాలు పెంచకుండా శత్రుపూరిత వైఖరి అనుసరిస్తున్నది. ఆఖరికి పొగాకు, మిర్చి, మామిడి, పత్తి, పామాయిల్ వంటి అనేక పంటల ధరలు దారుణంగా పడిపోయాయి. రైతులను ఆదుకోవడానికి కనీస మద్దతు ధర ప్రకటించి వాటి కొనుగోలుకు అవసరమైన నిధులు ఇవ్వటానికి కూడా ఈ ప్రభుత్వం ముందుకు రావటం లేదు. కేంద్రంపై వత్తిడి కూడా చేయడంలేదు. ఇక ప్రభుత్వ అభివృద్ధి వ్యూహం మొత్తం ప్రైవేట్ పెట్టుబడుల ప్రయోజనాలు చుట్టూ ఉంది. నిధుల వినియోగంలో ప్రజా దృక్పథం లేదు. ఈ ఆర్థిక నమూనా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచకపోగా పెద్ద ఎత్తున ప్రభుత్వ ఖజానా నిధులు, సహజ వనరులు, ప్రజా ఆస్తులు, సదుపాయాలు, మౌలిక సదుపాయాలను పెట్టుబడిదారుల పరం చేస్తున్నది. రాష్ట్రాన్ని మరింతగా అప్పుల ఊబిలోకి దించుతున్నది. నిరుద్యోగం, అసమానతలు పెంచుతున్నది. ఈ విధానం రాష్ట్రానికి, ప్రజలకు అత్యంత ప్రమాదకరంగా మారింది.

/వ్యాసకర్త సెల్ : 9490098792 /

కవిత్వం



అందాల పల్లె

అందాల పల్లె
ఆనందాల ముల్లె
తీగ చుట్టిన మల్లె
మట్టిగోడలు గట్టి మనసులు
మట్టిమనుషుల దండి గుండెలు
జాజు పూసిన అర్రలు
ప్రేమ చూపే కన్నులు
సూరు కిందికెళ్ళి
లొద్ది ఎదురుకోలు
కాకి వరుసలు అయినా
కాకి బలగం మోహరింపు
పెద్ద పెద్ద ఎనగర్రలు
వాళ్ల హృదయమంత విశాలం
ఎదురు నిలిచిన మొగురం
వాళ్ల మది వినీలం
సాలెంకడాలు కాళ్ళ కడాలు
గంటీలు పట్టగొలుసులు
ముక్కుపోగు పెట్టుకున్న దేవత
ముచ్చట పెట్టినట్టు అవ్వ ముచ్చట
పావురాల మాటలు పక్షుల కూతలు
పల్లె అలికిడి పెద్దవాకిలి
చేదుకున్నంత చెలిమి
పట్టుకున్నంత కలిమి
పల్లె తేనెపట్టు
పట్టుకొమ్మ
చెట్ల తీర్థం
తియ్యని చక్కెర తీర్థం!!

- బొల్లం బాలకృష్ణ,
కరీంనగర్, సెల్ : 9989735216

పరిశోధనా రంగానికి ప్రమాద ఘంటికలు!

ఆశ్చర్యంగా అమెరికా తన పరిశోధనా కార్యక్రమాలకు కత్తెర వేస్తోందట. ఫెడరల్ సైంటిస్టులను ఇంటికి పంపుతున్నారట. జాతీయ ఆరోగ్య సంస్థకు (ఎన్.హెచ్.ఐ) ఏకంగా ఈ సంవత్సరం 8 బిలియన్ డాలర్లు, వచ్చే ఏడు 18 బిలియన్ డాలర్లు కోత పెడుతున్నారట. జాతీయ సైన్సు ఫెడరేషన్ బడ్జెట్లో 5 బిలియన్ డాలర్లు తగ్గించేశారట. నాసాకు సైతం 25 శాతం నిధుల కోత పడిందట. ఇక విశ్వవిద్యాలయాల సంగతి సరేస "మీ నిధులు మీరు సమకూర్చుకోండి. దాతల్ని వెతుక్కోండి. మీ పరిశోధనలు సాగించుకోండి" అని ఫెడరల్ ప్రభుత్వం తేల్చి చెప్పేస్తోందట. ఒక్క ఆయుధాల పరిశోధనే దీనికి మినహాయింపు! దీంతో శాస్త్రవేత్తలు అమెరికా నుంచి వలస కట్టేందుకు సిద్ధమవుతున్నారు.



ఈ మాట నమ్మశక్యం గానిది. కారణం పరిశోధన లేని వైజ్ఞానిక పురోగతి లేదు. వైజ్ఞానిక అభివృద్ధి లేని సమాజ పురోగమనమూ లేదు. ఈ రంగంలో పోటీపడి ముందు నిలబడలేని దేశాలు ఎంత సంపద, ఎంత సంస్కృతి, ఎంత చరిత్ర వున్నా ముందుకు పోలేవు. శాస్త్ర సాంకేతికాభివృద్ధి పైనే ఆధునిక ప్రపంచం నడుస్తోంది. అమెరికా ప్రపంచాధిపత్యం కూడా దీని వల్లనే సాగుతోంది.

కానీ ఆశ్చర్యంగా అమెరికా తన పరిశోధనా కార్యక్రమాలకు కత్తెర వేస్తోందట. ఫెడరల్ సైంటిస్టులను ఇంటికి పంపుతున్నారట. జాతీయ ఆరోగ్య సంస్థకు (ఎన్.హెచ్.ఐ) ఏకంగా ఈ సంవత్సరం 8 బిలియన్ డాలర్లు, వచ్చే ఏడు 18 బిలియన్ డాలర్లు కోత పెడుతున్నారట. జాతీయ సైన్సు ఫెడరేషన్ బడ్జెట్లో 5 బిలియన్ డాలర్లు తగ్గించేశారట. నాసాకు సైతం 25 శాతం నిధుల కోత పడిందట. ఇక విశ్వవిద్యాలయాల సంగతి సరేసరి. "మీ నిధులు మీరు సమకూర్చుకోండి. దాతల్ని వెతుక్కోండి. మీ పరిశోధనలు సాగించుకోండి" అని ఫెడరల్ ప్రభుత్వం తేల్చి చెప్పేస్తోందట. ఒక్క ఆయుధాల పరిశోధనే దీనికి మినహాయింపు!

దీంతో శాస్త్రవేత్తలు అమెరికా నుంచి వలస కట్టేందుకు సిద్ధమవుతున్నారు. 'నేచర్ కెరీర్స్' కథనం ప్రకారం ఏకంగా 32 శాతం యూరపు బాట పడతామంటున్నారు. 'నేచర్ పోల్'లో పాల్గొన్న వారిలో 72 శాతం అగ్ర రాజ్యానికి వీడ్కోలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

ఇక యూరపులో చూస్తే అక్కడా నిధులు లేవు. ఎప్పుడూ ఒడిదుడుకులు. జీతాలు తక్కువ. శాస్త్రవేత్తలు తమ పరిశోధనను వదిలేసుకుని ఉన్న ఫళాన ఎక్కడికో వెళ్లిపోలేరు. ఎంత చెడ్డా ఇప్పటికీ అమెరికాదే విజ్ఞానాధిపత్యం గాబట్టి సీనియర్లు అక్కడే ఎలాగో సర్దుకుపోదామనుకుంటున్నారు!

ఒకప్పుడు సింగపూర్ మంచి జీతాలిచ్చి, ఉత్తమ వసతులు కల్పించి, గొప్ప దార్శనికతతో శాస్త్రవేత్తల్ని ఆకర్షించింది. అక్కడి మంచి స్కూళ్లు, ఆరోగ్య వ్యవస్థలు, భద్రత, రవాణా, స్వచ్ఛ వాతావరణం కూడా దీనికి తోడ్పడ్డాయి. జర్మనీ నుంచి 1930లలో వందలాది వైజ్ఞానికులు అమెరికా వచ్చారు. కానీ అప్పటి కారణం వేరు. అప్పుడక్కడ వారికి భద్రత లేదు.

ప్రస్తుతం కృత్రిమ మేధ, బయో టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, అంతరిక్షం, క్వాంటం రంగాల్లో ఎవరిది ఆధిక్యమో వారిదే ప్రపంచాధిపత్యం. దీన్ని "గ్లోబల్ టెక్ పోటీ" అంటున్నారు. ఈ పరుగులో 84.3. పాయింట్లతో అమెరికా అగ్ర భాగాన వుంది. చైనా 65.6 పాయింట్లతో దాని వెంట పరుగిడుతోంది. యూరపు మూడో స్థానంతో సరిపెట్టుకుంది. మిగిలినవి వాటి దరిదాపుల్లో లేవు. మన దేశం 15.2 పాయింట్లతో పదో స్థానంలో వుంటే మనకన్నా రష్యా, కెనడా, ఆస్ట్రేలియా, ఇటలీ, స్పెయిన్లు వెనకబడ్డం విశేషం.

"అలాంటప్పుడు అమెరికా యూరపుల నుంచి శాస్త్రవేత్తలు మన దేశానికి వలస వస్తారా" అంటే అలా ఏమీ కనపడ్డం లేదంటారు నోబెల్ అవార్డు గ్రహీత రామకృష్ణన్. కారణం అంతర్జాతీయ ప్రమాణాల పరిశోధనా సంస్థలు మనకు తక్కువ. మన ఐఐఎస్‌సి, ఎన్‌సిబిఎస్, టిఐఎఫ్ఆర్, ఐఐఎస్ఇఆర్, ఐఐటి లు లాంటివి ఒక్కొక్కటి ఒకటి రెండు రంగాల్లో అగ్ర భాగాన వుంటే వుండొచ్చు గానీ మొత్తంగా సంస్థలుగా చూస్తే వాటి నాణ్యత ప్రపంచంతో పోటీ పడగలది కాదు. దీర్ఘకాలిక బేసిక్ రీసెర్చ్‌కి అవకాశాలు వుంటేనే అమెరికా నుంచి శాస్త్రవేత్తలు తరలి వస్తారు. ఇందులో మనం అమెరికా చైనా, యూరపులతో తూగలేకున్నాం. ఇక మొదటి 100 అత్యున్నత విశ్వవిద్యాలయాల్లో మనది ఒక్కటీ లేదు.

ఇక నిధుల దగ్గరకు వస్తే పరిశోధనా రంగానికి మనం వెచ్చిస్తున్నది జిడిపి లో కేవలం 0.7 శాతం. చైనా వ్యయంతో పోలిస్తే ఇది మూడో వంతు కూడా లేదు. సివిల్ పరిశోధనల్లో ఇజ్రాయిల్ 6.30 శాతం, దక్షిణ కొరియా 4.9 శాతం, జపాన్ 3.3 శాతం, అమెరికా 3.46 శాతం తమ జిడిపి లలో ఖర్చు చేస్తుంటే మనం ఎక్కడో వుండిపొయ్యాం!

రామకృష్ణన్ అంతటితో ఆగక మన దేశ పరిశోధనా రంగానికి మౌలిక సదుపాయాలు, నిధులు లేకపోవడంతో పాటు దీర్ఘకాలిక దృక్పథం కూడా లేదంటారు. "ఇచ్చే నిధులు సకాలంలో ఇవ్వరని, స్కాలర్షిప్ లు ఎంత కాలానికీ రావని, ఎప్పుడు ఏ విధానాలు వస్తాయో తెలియవని, ప్రోత్సాహాలు ఇచ్చే సంప్రదాయం తక్కువని, రాజకీయాలు ఎక్కువ" అని ఆయన చెప్పుకొస్తారు.

జాతీయ పరిశోధనా ఫౌండేషన్‌కు (ఎన్.ఆర్.ఎఫ్) ఆర్భాటంగా 2011లో 50 వేల కోట్లు కేటాయించి, ఐదేళ్లలో కేవలం 14 వేల కోట్లిచ్చి, మిగిలినవి దాతల నుంచి సమీకరించుకోవాలన్న చరిత్ర మనది! ప్రైవేట్ పారిశ్రామికవేత్తలకు తక్షణ లాభాలపై ఉన్న మోజు దీర్ఘకాలిక పరిశోధనా రంగంపై ఎప్పుడూ లేని దేశం మనది! అమెరికా పరిస్థితి దీనికి భిన్నం అంటారాయన.

కానీ మన దేశ శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి సైన్సు పత్రాల ప్రచురణలో మనం 2029 నాటికి అమెరికాను అధిగమిస్తున్నామంటున్నారు. ఆయన లెక్క ప్రకారం ప్రస్తుతం (2024) చైనా 8,98,949, అమెరికా 4,57,335 భారత్ 2,07,390 లతో మొదటి మూడు వరుసల్లో వున్నాయి. ప్రపంచ అత్యున్నత శాస్త్రవేత్తల్లో మనవారు 5321 మంది (జపాన్ వారు 5608, జర్మనీ వారు 10,420).

కానీ సమస్య ఎక్కడ వస్తోందంటే మన పత్రాలు, పి.హెచ్.డిలు నాసిరకమైనవి. హైదరాబాదులోని ఒఎమ్ఐసిఎస్ గ్రూపునకు అమెరికా నైన్త్ సర్క్యూట్ కోర్టు 50 బిలియన్ డాలర్లు అపరాధం విధించింది. కారణం ఈ గ్రూపు ఏకాఎకి 69,000 పత్రాలు ప్రచురించింది. అన్నీ బోగస్‌వి, దండగ మారినవి. ప్రపంచంలోని ఫేక్ జర్నల్సులో 62 శాతం ఇండియాలోనే వున్నాయంటున్నారు. కనీసం 10 శాతం పి.హెచ్.డి ల సంగతీ ఇంతే!

"దీర్ఘకాలిక విధానాలు లేకపోవడం, సైన్సును రాజకీయం చేయడం, అధికారుల పెత్తనం, కాలుష్యభరిత నగరాలూ ఇలా ఎన్ని లోపాలున్నా భారతీయ సైంటిస్టుల, మరీ మన యువ వైజ్ఞానికుల కృషి చాలా గొప్పది! ఉష్ణ మండల వ్యాధుల మీదా, జీవావరణం మీదా మనవాళ్ల కృషి ప్రపంచంలో ఎవ్వరికి తీసి పోదు" అంటారు రామకృష్ణన్.

దీన్ని మారుతున్న కాలంలోనూ మన దేశం నిలబెట్టుకోగలదా? అగ్రరాజ్యం పరిశోధనా రంగంలోనూ ప్రపంచాన్ని అస్తవ్యస్తం చేస్తుందా? పరిశోధనలు మందగించాక ప్రపంచ గమనం ఎలా వుంటుంది? ఇవన్నీ ప్రశ్నలు.

/'జనవిజ్ఞానం' సౌజన్యంతో/

జనవాక్యం

సాంకేతిక సమస్యలు సరిదిద్దాలి

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రతీ నెల ఒకే రోజు క్లస్టర్ స్థాయిలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నది. అయితే సమావేశాల రోజున ఉపాధ్యాయుల హాజరు నమోదు, సమావేశపు ఫీడ్‌బ్యాక్ విషయంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో కూడా ఇదే విధంగా జరిగింది. కానీ విద్యా శాఖ సరిదిద్దడం లేదు. జూన్ నెలలో 19వ తేదీన జరిగిన స్కూల్ కాంప్లెక్స్‌లో సాయంత్రం ఐదు గంటల నుండి ఉపాధ్యాయుల ఫేషియల్ అటెండెన్స్ యాప్‌లో హాజరు పడక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా ఫీడ్ బ్యాక్‌ఫామ్ ఓపెన్ కాక వీరు ఆందోళన చెందారు. ఉపాధ్యాయులు ఫేసియల్ అటెండెన్స్ ఇన్ టైమ్ మధ్యాహ్నం ఒంటి గంటకు రిపోర్ట్ చేయాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కానీ సాంకేతిక లోపాల కారణంగా, సాయంత్రం నాలుగు గంటలకు కూడా ఇన్ టైమ్ హాజరు పడని పరిస్థితి ఏర్పడింది. కాంప్లెక్స్ సమావేశం ముగిసిన తర్వాత అవుట్ టైమ్ హాజరు వేయడానికి వీలు కాలేదు. కొంతమంది ఉపాధ్యాయులు తమ హాజరును వేయడానికి సాయంత్రం ఏడు గంటల వరకు వేచి చూసారు. ప్రతీ నెల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది కాబట్టి వచ్చే నెలలో జరగబోయే సమావేశాలలో ఇటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చూడాలి. ఉపాధ్యాయులకు ఎదురవుతున్న అసౌకర్యాన్ని నివారించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps@gmail.com

ఇన్ఫోసిస్‌కు రూ.6,921 కోట్ల లాభాలు

బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 9 శాతం వృద్ధితో రూ.6,921 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ 8 శాతం పెరిగి రూ.42,279 కోట్లకు చేరింది. బెంగళూరు కేంద్రంగా పని చేస్తోన్న ఈ ఐటి దిగ్గజంలో జూన్ ముగింపు నాటికి 3,23,788 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. గడిచిన తొలి త్రైమాసికంలో ఇన్ఫోసిస్ పనితీరులో ఎఐ సామర్థ్యాల బలాన్ని, క్లయింట్ కన్సాలిడేషన్ నిర్ణయాలలో విజయాన్ని అందుకుందని, 300,000 మందికి పైగా ఉద్యోగుల అంకితభావానికి ఇది నిదర్శనమని ఇన్ఫోసిస్ సిఇఒ సలీల్ పరేఖ్ పేర్కొన్నారు.



ప్రిరిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

ప్రజాహిత వ్యాజ్యంపై ప్రభుత్వానికి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి : రాష్ట్రంలోని వంద పడకల ప్రభుత్వ బోధనాస్పత్రులను అవయమార్పిడి కేంద్రాల స్థాయి కల్పించాలనే ప్రజాహిత వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులిచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. 2016లో పిల్ దాఖలైతే ఇప్పటి వరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించింది. ప్రభుత్వ జ్యాప్యంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. పిల్‌లో కోరినట్లుగా చేస్తే అవయవ రాకెట్ల ముఠాల ఆగడాలను అరికట్టవచ్చునని అభిప్రాయపడింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వంద పడకల ప్రభుత్వ బోధనాస్పత్రులను అవయ మార్పిడి చేసే కేంద్రాలుగా మార్పునకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ గరీబ్ గైడ్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు భార్గవి 2016లో పిల్ దాఖలు చేశారు. అడ్వకేట్ డివి రావ్ వాదిస్తూ, వంద పడకల ఆస్పత్రులు రాష్ట్రంలో 9 ఉంటే అవన్నీ ప్రైవేటువేనని, అవయ మార్పిడికి ఏటా 1,200 మంది అప్లికేషన్లు పెట్టుకుంటే వంద మందికే అవయ మార్పిడికి సుముఖత వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

'..వీరమల్లు' చరిత్రాత్మక చిత్రం

- విశాఖలో ప్రిరిలీజ్ ఈవెంట్‌లో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ప్రజలకు చరిత్రను తెలియజేయాలనే ఉద్దేశంతో హరిహరి వీరమల్లు చిత్రాన్ని తీసినట్లు కథానాయకుడు పవన్‌కల్యాన్ తెలిపారు. కృష్ణానది సమీపంలోని కొల్లూరు వద్ద కోహినూరు వజ్రం లభించిందని, దాని ప్రస్థానం ఎంతవరకు వెళ్లిందనేది ఈ చిత్ర కథాంశంగా ఉంటుందని చెప్పారు. మెగా సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఎఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకర్‌రావు నిర్మించిన హరిహర వీరమల్లు మొదటి పార్ట్ (స్వోర్డ్ వెర్సెస్ స్పిరిట్) చిత్రం ప్రి రిలీజ్ ఈవెంట్ బుధవారం సాయంత్రం విశాఖపట్నం బీచ్ రోడ్‌లోని ఏయు కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ప్రముఖ దర్శకులు క్రిష్, జ్యోతి కృష్ణలు సంయుక్తంగా తెరకెక్కించిన ఈ చిత్రంలో పవన్ కల్యాణ్, నిధి అగర్వాల్ హీరోహీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గురువారం విడుదల కానుంది. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... తాను 1992లో నటన నేర్చుకునేందుకు విశాఖపట్నం వచ్చానని, ఉత్తరాంధ్ర ఆటపాట అణువణువు తన గురువు సత్యానంద్ నేర్పించారని తెలిపారు. శిక్షణ తీసుకునే రోజుల్లో ధైర్యంగా ఎలా ఉండాలి అనే విషయాన్ని నేర్పించారని అన్నారు. ఈ సినిమాలో కీలక సన్నివేశాలకు సంబంధించి 60 రోజులపాటు తానే పరిశోధన చేసి తెరకెక్కించినట్లు వివరించారు. చిత్ర కథానాయక నిధి అగర్వాల్ ఈ చిత్ర విజయం కోసం ఎంతో శ్రమించారని తెలిపారు. చిత్ర దర్శకుడు జ్యోతికృష్ణ మాట్లాడుతూ... విజయవాడ పరిసర ప్రాంతాల్లోనే ఈ చిత్రాన్ని నిర్మించాలని పవన్ కల్యాణ్ సూచించారని చెప్పారు. తొలుత క్రిష్ రూపొందించిన స్క్రిప్ట్‌లో పలు కీలక మార్పులు చేసి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ శిక్షకుడు సత్యానంద్, ఎంఎం.కీరవాణిలను ఆయన సత్కరించారు.

ఆస్ట్రేలియాలో
భారత విద్యార్థిపై జాత్యహంకార దాడి

అడిలైడ్ : ఆస్ట్రేలియాలో 23 ఏళ్ల భారత విద్యార్థిపై జాత్యహంకార దాడి ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 19న అడిలైడ్‌లో భారత్‌కు చెందిన చరణ్‌ప్రీత్ సింగ్ కారులో బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో తమ కారును ఓ పక్కన పార్క్ చేసి నడుస్తుండగా, అకస్మాత్తుగా ఐదుగురు దుండగులు వేరే వాహనంలో అక్కడికి వచ్చి చరణ్‌పై భౌతిక దాడికి దిగారు. పదునైన వస్తువులతో కొడుతూ అతడిని దూషించారు.

ఈ దాడిలో చరణ్ ముఖం, వెనక భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఈ ఘటన దృశ్యాలను కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. ఆస్పత్రిలో చరణ్ మాట్లాడుతూ ... ఎలాంటి కారణం లేకుండానే తనపై దాడి జరిగిందని, ఈ దాడి తనను కలచి వేసిందన్నారు. భారత్‌కు తిరిగి వెళ్లిపోవాలనిపిస్తోందన్నారు. దాడికి పాల్పడిన దుండగుల్లో 20 ఏళ్ల యువకుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. సిసి టీవీ ఫుటేజ్ ఆధారంగా మిగిలినవారిని కూడా పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. దక్షిణ ఆస్ట్రేలియా ప్రీమియర్ పీటర్ మాలినాస్కస్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి జాత్యహంకార దాడులను సహించేది లేదని హెచ్చరించారు.

జస్టిస్ వర్మ పిటిషన్‌పై విచారణకు ప్రత్యేక బెంచ్

న్యూఢిల్లీ : అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ పిటిషన్‌పై విచారణకు ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేస్తానని భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయి వెల్లడించారు. ప్రత్యేక ధర్మాసనం నుంచి తాను వైదొలుగుతున్నట్లు సిజెఐ ప్రకటించారు. "దర్యాప్తు కమిటీలో ఉన్నందున విచారణ నేను చేపట్టడం సరికాదని బావిస్తున్నాను. ఈ పిటిషన్‌పై విచారణకు మరో బెంచ్ ఏర్పాటు చేయాల్సి వుంటుంది" అని సిజెఐ పేర్కొన్నారు. జస్టిస్ వర్మ తొలగింపునకు మాజీ సిజెఐ సంజీవ్ ఖన్నా సూచించిన సిఫారసుకు సంబంధించి పిటిషన్ పలు రాజ్యాంగ సమస్యలను లేవనెత్తిందని జస్టిస్ వర్మ తరపున న్యాయవాది కపిల్ సిబాల్ కోర్టుకు తెలిపారు. పార్లమెంట్‌లో జస్టిస్ వర్మ తొలగింపు ప్రక్రియ ప్రారంభమైన రెండు రోజుల తర్వాత, తొలగింపు అంశాన్ని న్యాయపరంగా పరిశీలిం చేందుకు సిజెఐ సుముఖత వ్యక్తం చేయడం గమనార్హం. మార్చి 14-15 తేదీల్లో జరిగిన అగ్ని ప్రమాదం తర్వాత జస్టిస్ వర్మ అధికారిక నివాస ప్రాంగణంలో దగ్ధమైన స్టోర్ రూమ్‌లో గుట్టలుగా నగదు లభ్యమైందని ముగ్గురు జడ్జిలతో కూడిన అంతర్గత విచారణ కమిటీ నిర్ధారించింది. జస్టిస్ వర్మ రాజీనామా చేసేందుకు నిరాకరించడంతో మే నెలలో మాజీ సిజెఐ సంజీవ్ ఖన్నా ఈ నివేదికను ప్రధాని, రాష్ట్రపతికి పంపిన సంగతి తెలిసిందే.

సర్జరీల కోసం వేచి ఉండే సమయం తగ్గించండి

- బర్డ్ ఆస్పత్రి వైద్యులకు టిటిడి చైర్మన్ ఆదేశం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో సర్జరీల కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని వైద్యులను టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు ఆదేశించారు. తిరుపతి పద్మావతి గెస్ట్‌హౌస్‌లోని సమావేశ మందిరంలో బర్డ్ ట్రస్ట్ నిర్వహణపై బుధవారం ఇఒ జె. శ్యామలరావుతో కలిసి టిటిడి చైర్మన్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సేవల్లో గ్రామీణ ప్రాంతాల రైతులకు, నిరుపేదలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సర్జరీల కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్యులు, సిబ్బంది, మందులు, పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. శ్యామలరావు మాట్లాడుతూ.. శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయంలో చిన్న పిల్లల గుండె ఆపరేష్లకు దాతలు విరాళం ఇచ్చే ఆపన్న హదయ స్కీం ఉందని, అదే విధంగా బర్డ్‌లోనూ పేదవారికి సర్జరీల కోసం అయ్యే ఖర్చులను దాతల నుంచి విరాళం సేకరించే అంశంపై టిటిడి జెఇఒ, ఎఫ్‌ఎఅండ్ సిఎఒ, బర్డ్ డైరెక్టర్ సంయుక్తంగా నివేదిక తయారు చేయాలని సూచించారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జి. జగదీశ్ మాట్లాడుతూ.. వికలాంగ పిల్లలకు సర్జరీలను తక్షణం చేస్తున్నామని, జాయింట్ రీప్లేసెంట్‌లకు ఏడాది సమయం పడుతోందని వివరించారు.

ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా పోరుకు సిద్ధం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ప్రజా పోరాటానికి సిద్ధమని శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గునుపల్లి గ్రామస్తులు స్పష్టం చేశారు. కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు అధ్యక్షతన బుధవారం గ్రామస్తులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని తమ గ్రామం తరపున పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తేల్చిచెప్పారు. కొబ్బరి, జీడి, పనస, మునగ, మామిడి వంటి పంటలు ఇక్కడి ప్రజలకు ఉపాధిని కల్పిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఏకపక్షంగా, ప్రజల ఆమోదం లేకుండా పోలీసు బలగాలను మోహరించి సర్వేల పేరిట రైతులకు నిద్ర లేకుండా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, అనధికారులు, ప్రైవేటు కంపెనీ వారు తమ భూములపైకి రావడం చూస్తుంటే తాము ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా లేదా అనే సందేహం కలుగుతోందన్నారు. ప్రజల తరఫున నిలవాల్సిన ప్రభుత్వం బహుళజాతి కంపెనీలకు దళారీగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బాధిత రైతు కుటుంబాలు దళారుల మాటలు విని మోసపోవద్దన్నారు. ఎవరెన్ని మాయమాటలు చెప్పినా తమ భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. సోంపేట థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలా కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక ఉద్యమాన్ని నడుపుతామన్నారు. మహిళలు కోనేరు నానమ్మ, మైలపల్లి మాకమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే డబ్బు మాకొద్దని, మా ఆస్తులే మాకు కావాలన్నారు. తిత్లీ తుపానులో సర్వం కోల్పోయి ఎంతో కష్టపడి మళ్లీ నిర్మించుకున్న పచ్చని ఉద్దానాన్ని నాశనం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు, మెట్టూరు సర్పంచ్ జోగి అప్పారావు, ఎంపిటిసి టి.రాజారావు, జోగి కామరాజు, జోగి శ్రీను పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజ్‌కు కొనసాగుతున్న వరద

విజయవాడ సిటీ : విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతోపాటు కీసర, మున్నేరు వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో కృష్ణా నదిలోకి వరద నీరు చేరుతుంది. దీంతో, విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిమట్టం పెరుగుతోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల నుంచి కూడా వరద నీటిని దిగువకు వదులుతున్న నేపథ్యంలో రానున్న రెండు, మూడు రోజులు కృష్ణా నదిలో వరద ప్రవాహం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రకాశం బ్యారేజీ వద్ద ప్రస్తుతం 20,748 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా బ్యారేజీ 25 గేట్లను అడుగు మేరకుపైకి ఎత్తి 18,125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాలువల ద్వారా 2,623 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. వరద నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఇబ్రహీంపట్నం-రాయపూడి మధ్య లాంచీల ప్రయాణం తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

శ్రీశైలం 2 గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుండి నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో జలవనరుల శాఖ అధికారుల సూచనల మేరకు జలాశయ అధికారులు బుధవారం మధ్యాహ్నం మరో గేటును ఎత్తారు. మొత్తం రెండు గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జున సాగర్‌కు 55,140 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కృష్ణమ్మ పరవళ్లను వీక్షించడానికి పర్యాటకుల తాకిడి ప్రారంభమైంది. ఎగువ జూరాల నుండి మూడు గంటల సమయానికి విద్యుత్తు ఉత్పాదనతో మాత్రమే 39,746 క్యూసెక్కులు, సుంకేసుల నుండి 36,975 క్యూసెక్కులతో కలిపి మొత్తం 76,721 క్యూసెక్కులు నీరు చేరుతోంది. తెలంగాణ పరిధి లోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో గడిచిన 24 గంటల్లో 17.573 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు. ఇందుకు 37,428 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 16.966 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు. ఇందుకు 31,795 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డి పాడుకు 20 వేలు క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,195 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి లెఫ్ట్ ఇరిగే షన్‌కు 1,273 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయ నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 883.80 అడుగులకు చేరింది. శ్రీశైలం జలాశయ నీటి నిలువ సామర్థ్యం 215 టిఎంసిలకు గాను ప్రస్తుతం 208.7210 టిఎంసిలుగా నమోదైంది. రెండు విద్యుత్ కేంద్రాల నుండి 66,827 క్యూసెక్కులు, బ్యాక్ వాటర్ నుండి 22,468 క్యూసెక్కులు, రెండు గేట్ల ద్వారా 55,140 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,44,435 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



శ్రీశైలం జలాశయం నుంచి రెండు గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

ఉప్పాడలో అలల ఉధృతి

- మత్స్యకార గ్రామాల్లోకి సముద్రపు నీరు



మాయాపట్నం గ్రామంలోకి చొచ్చుకొచ్చిన సముద్రపు నీరు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో సముద్రపు కెరటాల నీరు ఉప్పాడ శివారు మాయాపట్నం, సూరాడపేట మత్స్యకార గ్రామాల్లోకి చొచ్చుకొచ్చింది. అధికారులు, గ్రామ సర్పంచ్ బుధవారం తాత్కాలికంగా కాలువలు తవ్వించి సముద్రపు నీటిని తొలగిస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణితో రెండు రోజుల నుంచి సముద్రపు అలలు అధికంగా ఉన్నాయి. దీంతో, తీరం వెంబడి ఉన్న మత్స్యకార గ్రామాల్లోకి సముద్రపు నీరు చేరుకోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సముద్రపు అలలు ఎగసి పడినప్పుడు, చిన్నపాటి వర్షానికి నీరు నిల్వ ఉండిపోవడంతో దుర్వాసనతోపాటు దోమలు, విషపురుగులు చేరుకుంటున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్రపు కెరటాలను అదుపు చేస్తే తప్ప, తమ సమస్య తీరదని వాపోతున్నారు. ఉప్పాడ, కాకినాడ బీచ్ రోడ్ అలల తాకిడికి ధ్వంసం కావడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన బీచ్ రోడ్డు ఎగసిపడుతున్న అలలకు పూర్తి స్థాయిలో ధ్వంసమైంది.

సహాయక చర్యలు చేపట్టండి : డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆదేశం

మాయాపట్నంలో బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యలు చేపట్టాలని డిప్యూటీ సిఎం, పిఠాపురం నియోజకవర్గ ఎంఎల్ఎ కె.పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఆహారం, పాలు, మంచినీరు అందించాలని, వైద్య సిబ్బందిని, ఔషధాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

అనుబంధ విభాగాలు బలోపేతం

- వైసిపి కో-ఆర్డినేటర్ సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



అనుబంధ విభాగాలన్నీ బలోపేతం అవ్వాలని, రాష్ట్రస్థాయి నుండి గ్రామస్థాయి వరకూ అందరూ సమిష్టిగా పనిచేయాలని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. కమిటీలన్నీ పూర్తయితే రాష్ట్రంలో 14 లక్షల నుండి 18 లక్షల మంది సైన్యం తయారవుతారని పేర్కొన్నారు. అనుబంధ విభాగాల కమిటీలూ పూర్తి చేయాలన్నారు. అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. జగన్‌ను మరోసారి సిఎంను చేసుకునే దిశగా అన్ని కమిటీలూ పనిచేయాలని తెలిపారు.

పోలీసుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారు: మాజీ ఎంపి గోరంట్ల మాధవ్

కొంతమంది పోలీసులు ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి పనిచేస్తున్నారని, విధి నిర్వహణ కంటే రాజకీయ ప్రాపకానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి కార్యకర్తలు, నాయకులపై నిరంతరం కేసులు రిమాండ్లు, నోటీసులతో కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు.

మహిళలపై వేధింపులు : రాయన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై వేధింపులు పెరిగాయని, వారికి ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడం లేదని విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చడం లేదని విమర్శించారు.

వ్యభిచార గృహ నిర్వాహకురాలికి సహకరించిన
ఇద్దరిపై సస్పెన్షన్ వేటు

- 'ప్రజాశక్తి' వార్తంకు స్పందించిన ఎస్‌పి

ప్రజాశక్తి- పెద్దాపురం (కాకినాడ ప్రతినిధి)

కాకినాడ జిల్లా పెద్దాపురంలో వ్యభిచార గృహ నిర్వాహకురాలికి సహకరించారనే అభియోగాలపై కానిస్టేబుల్ జి.శివరామకృష్ణ, హోమ్‌గార్డ్ సిహెచ్. శివకృష్ణ లను సస్పెండ్ చేసినట్టు ఎస్‌పి బిందు మాధవ్ తెలిపారు. పెద్దాపురం ఎస్ఐపైనా, ఇతర అధికారుల పైనా క్రమశిక్షణ చర్యల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామని చెప్పారు. పెద్దాపురంలో హైటెక్ వ్యభిచారంపై 'ప్రజాశక్తి' లో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. ఈ కేసు విచారణకు ప్రత్యేక బృందం నియమించినట్టు తెలిపారు. పెద్దాపురానికి చెందిన వ్యభిచార గృహ నిర్వాహకురాలిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. త్వరలో ఆమెను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెడతామన్నారు.

వ్యభిచార గృహాలపై పోలీసుల దాడులు

పెద్దాపురంలోని వ్యభిచార గృహాలపై ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి శ్రీహరిరాజు ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ ఇటీవల సోషల్ మీడియాలో, యూ ట్యూబ్‌లలో ఇద్దరు వ్యభిచార వృత్తిలో ఉన్న మహిళలకు సంబంధించిన అంశం వైరల్ అయ్యిందన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కరేడులో భూసేకరణను విరమించుకోవాలి


- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

కరేడులో చేపడుతున్న భూ సేకరణను తక్షణం విరమించుకోవాలని ఎపి రైతు సంఘం నెల్లూరు జిల్లాకమిటీ కార్యదర్శి మూలి వెంగయ్య, అధ్యక్షులు పి.శ్రీరాములు, ఉపాధ్యక్షులు మూలం రమేష్ డిమాండ్ చేశారు. ఇండోసోల్ పరిశ్రమకు భూములు ఇవ్వాలని, అందుకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ రైతులు తమ భూములను ఇచ్చేందుకు సిద్ధంగా లేరని తెలిపారు. ప్రజల మధ్య స్థానిక ఎమ్మెల్యే చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో రైతులు పోరాడాలని కోరారు.

రాజస్థాన్‌లో స్మార్ట్ మీటర్ల షాక్

- 15 శాతం పెరిగిన విద్యుత్ బిల్లులు
- వ్యతిరేకంగా ప్రజల ఆందోళనలు



జైపూర్ : రాజస్థాన్‌లో విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల షాక్ కొడుతోంది. బిజెపి పాలిత రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో దాదాపు పూర్తి స్థాయిలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. వీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేల కోట్లను ఖర్చు చేసింది. గతంలో పాత విద్యుత్ మీటర్‌తో ఏ వినియోగదారుడూ ఎటువంటి సమస్యను ఎదుర్కోలేదు. తాజా స్మార్ట్ మీటర్లతో ఇప్పుడు వినియోగదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత మీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల రీడింగ్‌లు చాలా వేగంగా తిరుగుతున్నాయి. ఇది వరకటితో పోలిస్తే 15 శాతం బిల్లులు అధికంగా వస్తున్నాయని వేలాదిమంది వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నెలవారీ బిల్లులు గురించి విద్యుత్ అధికారులకు ఫిర్యాదులు చేస్తుంటే పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ మీటర్లలో రీడింగ్ నమోదైన తరువాత తామేమీ చేయలేమని అధికారులు చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువగా వచ్చినా బిల్లు కట్టాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ఆలస్యంగా బిల్లు చెల్లిస్తే జరిమానా విధిస్తున్నారని, నోటీసు లేకుండా కనెక్షన్లు కట్ చేస్తున్నారని చెప్పారు. తిరిగి మళ్లీ కనెక్షన్లు ఇవ్వడానికి రూ.2,500 వసూలు చేస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు.

బిల్లు గణనీయంగా పెరిగింది : స్థానికులు

హల్దీఘాటీ మార్గ్‌లోని తిరుపతినగర్‌కు చెందిన దినేష్ వర్మ స్థానిక మీడియాతో మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తరువాత విద్యుత్ బిల్లు పెరిగాయని, మునుపటి బిల్లులతో పోల్చినప్పుడు గణనీయమైన తేడా కనిపించిందని చెప్పారు. తిరుపతి బాలాజీ నగర్‌కు చెందిన వినియోగదారుడు వినోద్ థాపా మాట్లాడుతూ అధికంగా వచ్చిన బిల్లును గడువులోపు చెల్లించలేకపోయానని, దీంతో తన కనెక్షన్ తొలగించినట్లు చెప్పారు. మళ్లీ కనెక్షన్ ఇవ్వడానికి అదనంగా రూ.2500 వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ధాని ఝూత్వారాకు చెందిన రణవీర్ సింగ్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ ఏర్పాటు తరువాత బిల్లులు పెరిగాయని, సమస్యను అనేకసార్లు అధికారులకు నివేదించినా ఎలాంటి పరిష్కారం చూపలేదని చెప్పారు.

కాగడాల ప్రదర్శన

స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. హనుమాన్‌గఢ్‌లో సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం రాత్రి కాగడాల ప్రదర్శన చేశారు. స్మార్ట్ మీటర్లను అనుమతించేది లేదంటూ ప్రజలు పెద్దపెట్టున నినాదాలు చేశారు.

26న సిపిఎం భేటీ

రాజస్థాన్‌లో స్మార్ట్ మీటర్లను ఏకపక్షంగా విధించడాన్ని, విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సిపిఎం రాజస్థాన్ రాష్ట్ర కమిటీ ఈ నెల 26 ఉదయం 11 గంటలకు సికార్‌లోని పార్టీ కార్యాలయం ముందు ఉన్న స్టేషన్ రోడ్‌లోని రన్మల్ సింగ్ కిసాన్ ఆడిటోరియం హాల్‌లో ఒక సమావేశం నిర్వహిస్తోంది.

ఈ సమావేశానికి ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, సికార్ ఎంపి అమ్రారామ్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, అఖిల భారత ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ సంయుక్త కార్యదర్శి సుదీప్ దత్తా, విక్రమ్ సింగ్ పాల్గొననున్నారు. ఈ విషయాన్ని పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రజల రాజ్యాంగబద్ధ హక్కులకు విరుద్ధం : సిపిఎం

ఒక నిర్దిష్ట కంపెనీకి ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో, ఎలాంటి అవసరం లేకపోయినా పాత వర్కింగ్ మీటర్ల స్థానంలో రీడింగ్‌లను వేగంగా పెంచే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం తీవ్రమైన అంశమని, సామాన్య ప్రజలపై తీవ్ర భారాన్ని మోపుతున్నారని సిపిఎం విమర్శించింది.

ఈ ప్రక్రియ విద్యుత్ బిల్లు 2020ని అమలు చేసే దిశగా ఉందని, ఈ బిల్లును ఉపసంహరించుకుంటామని రైతు ఉద్యమ సమయంలో లిఖితపూర్వకంగా ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేసింది. 'స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియలో ప్రజాస్వామ్య చర్చలు, పారదర్శకత, జవాబుదారీతనం పూర్తిగా లోపించాయి. ఇది ప్రజాస్వామ్య వ్యతిరేకమే కాదు, ప్రజా వనరులను ప్రైవేట్ ప్రయోజనాలకు అప్పగించడానికి ఒక రహస్య కుట్ర కూడా. సిపిఎం రాజస్థాన్ రాష్ట్ర కమిటీ దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది' అని తెలిపింది.

మోటూరు పూర్ణచంద్రరావు స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

- లేబర్ కోడ్లను తిప్పికొట్టడమే నిజమైన నివాళి
- పూర్ణచంద్రరావు స్మారక సభలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



స్మారక సభలో ప్రసంగిస్తున్న వై వెంకటేశ్వరరావు

ప్రముఖ కార్మిక నాయకులు, సిఐటియు హైదరాబాద్ మాజీ కార్యదర్శి మోటూరు పూర్ణచంద్రరావు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్మించాలని పలువురు వక్తలు అన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్లను తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను సంఘటితం చేసి కేంద్రం కుట్రలను అడ్డుకోవడమే పూర్ణచంద్రరావుకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. గుండెపోటుతో ఈ నెల 13న కన్నుమూసిన మోటూరు పూర్ణచంద్రరావు స్మారక సభను బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. హెచ్‌ఎంటి, ఇసిఐఎల్, బిహెచ్ఇఎల్, ఐడిపిఎల్ కార్మిక సంఘాల నాయకులు, సిఐటియు నేతలు, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, మోటూరు అభిమానులు, బంధు మిత్రులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్ మాట్లాడుతూ...ప్రజాశక్తి పత్రికకు మోటూరు పూర్ణచంద్రరావు అందించిన సహకారం చరిత్రలో చిరకాలం నిలిచి ఉంటుందన్నారు. అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా 2023లో పుట్టపర్తిలో జరిగిన మోటూరు హనుమంతరావు ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ సభకు పూర్ణచంద్రరావు హాజరయ్యారని గుర్తుచేశారు. పూర్ణచంద్రరావు ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రజాశక్తి కృషి చేస్తుందని చెప్పారు. ప్రజాశక్తి తరుపున, వ్యక్తిగతంగా పూర్ణచంద్రరావుకు జోహార్లు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... చివరివరకూ ప్రజల కోసం పనిచేసిన గొప్ప వ్యక్తి మోటూరు పూర్ణచంద్రరావు అని అన్నారు. ఎప్పుడు కలిసినా సమకాలీన రాజకీయ విశ్లేషణ, ప్రజాశక్తి గురించే మాట్లాడేవారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు పర్యాయాలు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారని తెలిపారు. సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున, వ్యక్తిగతంగా మోటూరు పూర్ణచంద్రరావుకు జోహార్లు అర్పించారు. తమ తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెవెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పూర్ణచంద్రరావు కుమారులు ప్రమోద్, ప్రవీణ్.. కుమార్తె పద్మజ, ఇతర కుటుంబ సభ్యులు తెలిపారు. తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జ్యోతి, తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నర్సింహారావు, హెచ్‌ఎంటి ట్రేడ్ యూనియన్ నాయకులు కోటేశ్వరరావు,గోపీచంద్, పివి సత్యనారాయణ, సిహెచ్. మల్లేశ్వరా చారి, పిఎస్ఎన్ మూర్తి, జన విజ్ఞాన వేదిక నాయకులు వరప్రసాద్, ఇసిఐఎల్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యం !

- బ్రిటన్, మాల్దీవుల పర్యటనకు ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : బ్రిటన్, మాల్దీవుల్లో నాలుగు రోజుల పర్యటనకు ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటన వల్ల ఆ రెండు దేశాలతో భారత్ ద్వైపాక్షిక, ఆర్థిక సంబంధాలు మరింత పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. పర్యటనకు బయలుదేరడానికి ముందు ఆయన ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. భారత్, బ్రిటన్‌ల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం వుందని తెలిపారు. ఇటీవలి కాలంలో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, వినూత్న ఆవిష్కరణలు, రక్షణ, విద్య, పరిశోధన, ఆరోగ్యం, ప్రజల మధ్య సంబంధాలు వంటి పలు రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం విస్తృతంగా వుందన్నారు. ఈ పర్యటనా కాలంలో ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఇరు దేశాల్లోనూ ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి పెడుతూ చర్యలు వుంటాయన్నారు. రాజు చార్లెస్-3తో కూడా మోడీ భేటీ కానున్నారు. ఆ తర్వాత అధ్యక్షుడు ముయిజు ఆహ్వానం మేరకు మోడీ మాల్దీవులు వెళతారు. మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 60ఏళ్లు కావస్తోందని మోడీ పేర్కొన్నారు. సముద్ర జలాల భద్రతా భాగస్వామ్యంతోపాటు సమగ్ర ఆర్థిక సంబంధాలను కూడా ముందుకు తీసుకెళ్లడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు మోడీ ఆ ప్రకటనలో తెలిపారు.

చైనీయులకు భారత్ వీసాల ప్రక్రియ పునఃప్రారంభం

న్యూఢిల్లీ : చైనీయులకు టూరిస్టు వీసాల జారీ ప్రక్రియను భారత్ పునఃప్రారంభించింది. కోవిడ్, గల్వాన్ వివాదాల నేపథ్యంలో ఐదేళ్ల క్రితం నుంచి చైనా పౌరులకు జారీ చేసిన పర్యాటక వీసాలను భారత్ రద్దు చేసిన విషయం తెలిసిందే. దాదాపు ఐదేళ్ల తర్వాత చైనీయులకు భారత్ టూరిస్టు వీసాల జారీ ప్రక్రియను ఈ నెల 24 నుంచి పునః ప్రారంభిస్తున్నట్లు చైనాలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. లడ్డాఖ్ సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ, గస్తీ పునఃప్రారంభం, ఇరుదేశాల మధ్య నేరుగా విమాన సర్వీసుల పునరుద్ధరణ, కైలాస మానస సరోవర్ యాత్ర పునఃప్రారంభం వంటి చర్యలు జరుగుతున్న సమయంలోనే భారత్ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.

లాల్ సలామ్ అచ్యుతానందన్

(మొదటి పేజీ తరువాయి)

వెల్లిక్కకట్‌కు భౌతిక కాయం చేరుకున్న వెంటనే తొలుత ఇంట్లోకి తీసుకువెళ్ళారు. ఆ తర్వాత ప్రజల సందర్శనార్ధం ఇంటి ఆవరణలో వుంచారు. దశాబ్దాలుగా తమ వెన్నంటి వుండి నడిపించిన తమ నాయకుడికి తుది వీడ్కోలు పలికేందుకు మంగళవారం సాయంత్రానికే చేరుకున్న వేలాదిమంది ప్రజలు విషణ్ణ వదనాలతో మౌనంగా నిలుచుని వుండడం కనిపించింది. వెళిక్కకథు నివాసం నుండి బయలుదేరిన తర్వాత సిపిఎం అలప్పూజ జిల్లా కార్యాలయానికి చేరుకున్న తర్వాత అక్కడ కాసేపు వుంచారు. పార్టీ కార్యకర్తలందరూ నివాళులర్పించిన తర్వాత అంత్యక్రియలు జరిగే వేదికవద్దకు తీసుకువచ్చారు.

మహోజ్వలంగా సాగిన పున్నప్ర-వాయలార్ తిరుగుబాటు ఉద్యమ అమరులు శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్న వాలియాచుడుక్కాడ్ నేల మరో యోధునికి ఆశ్రయమిచ్చింది. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగానే చేరుకున్న వేలాదిమంది ప్రజలు అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. వాలియా చుడుక్కాడ్ వద్ద సిపిఎం, సిపిఐ పతాకాలను అవనతం చేశారు. సంతాప సూచకంగా నల్ల జెండాలను ఎగురవేశారు. లాల్ సలామ్ అని రాసి వున్న ప్లకార్డులు కనిపిస్తున్నాయి. అంత్యక్రియలను పురస్కరించుకుని అలప్పూజ జిల్లా యంత్రాంగం అన్ని కార్యాలయాలు, స్కూళ్ళు, కాలేజీలకు బుధవారం సెలవు దినంగా ప్రకటించింది.

ఉపరాష్ట్రపతి ఎన్నికకు కసరత్తు

- ప్రక్రియ ప్రారంభమైంది : ఇసి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జగదీప్ ధన్‌ఖర్ రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పదవి కోసం త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఈ కసరత్తు పూర్తవగానే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనుంది. ఇప్పటికే ఉపరాష్ట్రపతి ఎన్నికల కోసం ఎలక్టోరల్ కాలేజీని సిద్ధం చేయడంలో, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించడంలో ఇసి కసరత్తు చేస్తోంది. ఉప రాష్ట్రపతి ఎన్నికకు ప్రక్రియ ప్రారంభమైందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర హోంశాఖ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్‌తో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా ఆమోదించినట్లు ప్రకటించిన విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు గుర్తుచేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఉపరాష్ట్రపతి ఎన్నికలను నిర్వహించాల్సిన బాధ్యత భారత ఎన్నికల సంఘానికి ఉందని స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియను 'ప్రెసిడెన్షియల్ అండ్ వైస్-ప్రెసిడెన్షియల్ ఎలక్షన్స్ యాక్ట్ 1952' ప్రకారం రూపొందించిన 'ప్రెసిడెన్షియల్ అండ్ వైస్-ప్రెసిడెన్షియల్ ఎలక్షన్ రూల్స్ 1974' ద్వారా నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రక్రియను అనుసరిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఉపరాష్ట్రపతి ఎన్నికల సన్నాహాలను ప్రారంభించిందని తెలిపారు.

ఈ సన్నాహక చర్యలు పూర్తయ్యాక, ఎన్నికల షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామన్నారు. ప్రస్తుతానికి ప్రారంభించిన ప్రధాన సన్నాహక చర్యలను ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్టోరల్ కాలేజ్ (ఓటర్ల జాబితా) తయారీ, ఇందులో లోక్‌సభ, రాజ్యసభకు చెందిన ఎన్నికైన సభ్యులతో పాటు నామినేట్ అయిన సభ్యులు కూడా ఉంటారని చెప్పుకొచ్చారు. రిటర్నింగ్ ఆఫీసర్/ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌లను ఖరారు చేస్తామని, ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్‌ను ప్రకటిస్తామని సిఇసి అధికారులు పేర్కొన్నారు.

ఆగస్టు చివరి నాటికి ఉపరాష్ట్రపతి ఎన్నిక పూర్తి..!

మరో రెండేళ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో దేశంలో రెండో అత్యున్నత స్థానం ఖాళీ అయింది. తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతుంది. రాబోయే 48 నుంచి 72 గంటల్లో ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కొత్త ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ ఆగస్టు చివరి నాటికి పూర్తవుతుందని పేర్కొన్నాయి.

ఉపరాష్ట్రపతి రేసులోకి రాజ్‌నాథ్ సింగ్..

తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతుంది. అధికార పార్టీ పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. జెడియు ఎంపి, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ కూడా ఉపరాష్ట్రపతి రేసులో ఉన్నారు. ఇద్దరు లెఫ్టినెంట్ గవర్నర్లు కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. జమ్ము కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఢిల్లీ ఎల్జీ సక్సేనాలో ఎవరికో ఒకరికి అవకాశం ఇవ్వనున్నట్లు ప్రభుత్వ వర్గాల్లో తీవ్రంగా చర్చ నడుస్తోంది. ఇప్పుడు అనూహ్యంగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేరు కూడా రేసులోకి వచ్చింది. దీంతో ఈ పదవి చేపట్టబోయేది ఎవరన్నది ఆసక్తికరంగా మారింది.

ఆగని ఆకలి చావులు

- మానవతా సాయాన్ని అడ్డుకున్న ఇజ్రాయిల్ దుర్మార్గానికి 111 మంది మృతి
- వారిలో 80 మంది చిన్నారులే



సహాయక శిబిరంలో ఆహారం అందక చిక్కిశల్యమైన చిన్నారి

గాజా : ఇజ్రాయిల్ విచక్షణారహితంగా జరుపుతున్న దాడులతో, నిత్యావసరాలపై విధించిన ఆంక్షలతో కుదేలైన గాజాలో గత 24గంటల్లో ఆకలిదప్పులతో అలమటిస్తూ 10మంది పాలస్తీనియన్లు మరణించారు. మానవతా సాయాన్ని అడ్డుకుని ఇజ్రాయిల్ సృష్టించిన కృత్రిమ కరువు వల్ల మరణించిన వారి సంఖ్య 111కి పెరిగింది. వీరిలో 80మంది వరకు అభం శుభం తెలియని చిన్నారులే వున్నారని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. బుధవారం ఉదయం నుండి దాడుల్లో మృతి చెందిన వారి సంఖ్య 41కి పెరిగింది. కరువువాతపడి మరణించేవారి సంఖ్య గాజావ్యాప్తంగా పెరుగుతోందని హెచ్చరిస్తూ 109 సహాయక సంస్థలు, మానవ హక్కుల గ్రూపులు తక్షణమే ఇజ్రాయిల్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ పిలుపునిచ్చాయి. తక్షణమే మానవతా సాయంపై ఆంక్షలన్నింటినీ ఉపసంహరించుకోవాలని కోరాయి. ఈ సంస్థలన్నీ హమాస్‌కు ప్రచారం సాగిస్తున్నాయంటూ ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. మరోవైపు ఇజ్రాయిల్ బలగాలు గాజాపై దాడులు కొనసాగిస్తున్నాయి.

గాజాలో పరిస్థితులు దుర్భరంగా మారిన పరిస్థితుల్లో తక్షణమే ఇజ్రాయిల్‌పై చర్యలు తీసుకోవాలని యురోపియన్ యూనియన్ హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దూత స్టీవ్ విట్కాఫ్ గాజాలో కాల్పుల విరమణ చర్చల కోసం యూరప్‌కు వెళుతున్నారు.

పంచాయతీలకు పైసల్లేవ్ !

(మొదటి పేజీ తరువాయి)

పది పని దినాల్లో ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం.. స్థానిక సంస్థలకు కేటాయించాల్సి ఉంది. గడువు దాటితే, సాధ్యమైనంత త్వరగా నిధులు విడుదల చేయడంతోపాటు మార్కెట్ అప్పులకు చెల్లిస్తున్న విధంగా వడ్డీని చెల్లించాల్సి ఉంది. అయితే, ప్రభుత్వాలు ఈ నిబంధలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా స్థానిక సంస్థల నిధులు ఇతర అవసరాలకు మళ్లిస్తున్నాయి. అవకాశం ఉన్నప్పుడు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల నుంచి ఒత్తిడి వచ్చినప్పుడు ఈ నిధులను విడుదల చేస్తున్నాయి. కేంద్రం ఆర్థిక సంఘం నిధులను నేరుగా స్థానిక సంస్థలకే విడుదల చేయాలని నిర్ణయించినప్పటికీ అది ఆచరణలో అమలు జరగడం లేదు.

స్థానిక సంస్థల్లో అభివృద్ధి, మౌలిక సుదుపాయాల కల్పనకు అన్‌టైడ్ గ్రాంటు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా కోసం టైడ్ గ్రాంటు వినియోగించాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన తరుణంలోనూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం.

ఈ ఏడాది నిధులపైనా ప్రభావం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) 15వ ఆర్థిక సంఘం రూ.2,099 కోట్లను రాష్ట్రానికి కేటాయించింది. ఈ నిధుల్లో మొదటి విడత సుమారు రూ.980 కోట్లు మరో రెండు నెలల్లో విడుదల కావాల్సి ఉంది. గతేడాది కేటాయించిన నిధులు స్థానిక సంస్థలకు బదలాయించకపోవడంతో కేంద్రానికి యుసిలు సమర్పించడం సాధ్యం కాదు. దీంతో ఈ ఏడాది నిధుల విడుదలను నిలిపివేస్తోంది. కాబట్టి ప్రభుత్వ చర్యల కారణంగా ఈ ఏడాది రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు స్థానిక సంస్థలకు సరైన సమయంలో అందే అవకాశం లేదు.

ఆందోళనకు సిద్ధమవుతున్న సర్పంచులు

రాష్ట్ర ప్రభుత్వం తీరుపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు సంబంధించి గత కొన్ని నెలలుగా సిఎం, డిప్యూటీ సిఎం, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌కు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎటువంటి ఫలితం లేదని వాపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన అన్ని జిల్లాల్లో ఈ నెల 21న కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాజధానిలో నిరసనకు సిద్ధం అయ్యేందుకు కార్యాచరణ రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

రాజ్యాంగ బద్ధంగా స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులను వాటికి కేటాయించకుండా.. ఇతర అవసరాలకు వినియోగించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్నాయి. గత 7 నెలలుగా అనేక పర్యాయాలు మంత్రులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశాం. అయినప్పటికీ స్పందన కనిపించలేదు. గత వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి నిధుల కొరత ఎదుర్కొన్నాం. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నిధుల కొరతతో పారిశుధ్య పనులు చేపట్టలేని పరిస్థితి అనేక పంచాయతీల్లో ఉంది. ప్రతి మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఆర్థిక సంఘం నిధుల విషయంలో మాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదు.

- (ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కృష్ణమోహన్)

మూడోరోజూ అట్టుడికిన పార్లమెంటు

(మొదటి పేజీ తరువాయి)

పెంపొందించే లక్ష్యంతో రూపొందించినట్లు తెలిపారు. తిరిగి ప్రారంభమైన ఉభయ సభల్లో పరిస్థితుల్లో ఎటువంటి మార్పు కనబడలేదు. దీంతో నిమిషాల్లో ఉభయ సభలు గురువారానికి వాయిదా పడ్డాయి.

29 నుంచి ఆపరేషన్ సిందూర్‌పై చర్చ

వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్‌పై ఈ నెల 29న ఆ చర్చ జరగనుంది. లోక్‌సభలో 16 గంటలు, రాజ్యసభలో 9 గంటలపాటు చర్చించేందుకు సమయాన్ని కేటాయించారు. బుధవారం జరిగిన బిజినెస్ అడ్వైజరీ మీటింగ్ (బిఎసి)లో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. చర్చ ముగిసిన తరువాత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమాధానం ఇవ్వనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమాధానం ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఆపరేషన్ సిందూర్‌ను ఆపినట్లు ట్రంప్ 25 సార్లు చెప్పడంలో మర్మమేంటి?

ఆపరేషన్ సిందూర్‌ను ఆపింది తానేనని ట్రంప్ 25 సార్లు చెప్పడంలో మర్మమేంటి? అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. పార్లమెంటు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని ఒకవైపు చెబుతున్నారని, మరోవైపు విజయం సాధించినట్లు చెబుతున్నారని, డొనాల్డ్ ట్రంప్ ఆపరేషన్ సిందూర్‌ను ఆపింది తానే అని 25 సార్లు చెప్పారని, దీంట్లో ఏదో మర్మం ఉందని, మన విదేశాంగ విధానాన్ని ఏ దేశం కూడా సపోర్టు చేయలేదని రాహుల్ గాంధీ అన్నారు. దీనిపై కేంద్రం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ భక్తులమని చెప్పుకుంటున్న వారు సమాధానం చెప్పకుండా తప్పించుకుని తిరుగుతున్నారని, ప్రధాని దీనిపై కనీసం ఒక్క ప్రకటనా చేయలేదని అన్నారు. 'ఇది తన పనేనని ప్రకటన చేయడానికి ట్రంప్ ఎవరు? ఇది ఆయన పని కాదు. ప్రధాని ఇంతవరకూ స్పందించకపోవడం వాస్తవం' అని పేర్కొన్నారు.

పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన

బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీల నేతలు పార్లమెంట్లో ఆందోళన చేపట్టారు. బుధవారం పార్లమెంటు ఉభయ సభల ప్రారంభానికి ముందు మకర ద్వారం ఎదురుగా ప్రతిపక్ష ఇండియా బ్లాక్ పార్టీల నేతలు ప్లకార్డులు చేబూని ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. ప్రభుత్వ ఉద్దేశం, చట్ట బద్ధతను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్, డిఎంకె నేతలు కనిమొళి, టిఆర్ బాలు, ఎ రాజా, ఆర్‌జెడి ఎంపిలు మీసా భారతి, మనోజ్ కుమార్ ఝా, సిపిఎం ఎంపిలు అమ్రారామ్, సచ్చిదానందన్ తదితరులు పాల్గొన్నారు. బీహార్‌లో ఎస్ఐఆర్ సమస్య, పహల్గామ్ ఉగ్రవాద దాడి, నిఘా వైఫల్యాలపై పార్లమెంటులో చర్చ జరపాలని ఎస్‌పి ఎంపి డింపుల్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ అంశాలను నివారించడానికి ప్రయత్నిస్తోందని ఆమె విమర్శించారు.

ఏడాదిలో రూ.120 బిలియన్ల పెట్టుబడులు

- ఇన్వెస్టోపియా సదస్సులో సిఎం
- ఎపిఇబిడి-యుఎఇ మధ్య ఒప్పందాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంతర్జాతీయ పెట్టుబడులకు ఎపి గేట్‌వేగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో బుధవారం జరిగిన ఇన్వెస్టోపియా సదస్సులో ఆయన మాట్లాడారు. యుఎఇ మంత్రి అబ్దుల్ బిన్ లౌక్ ఆల్ మరిని తాను కలిసిన సమయంలో తొలుత ఎపికి వచ్చి చూసిన తరువాత దేశంలో ఇతర ప్రాంతాలకు వెళ్లాలని తాను కోరారని, ఆయన ఎపికి వచ్చారని తెలిపారు. ఏడాదిలో ఎపిలో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షిస్తుందని అన్నారు. అందుకు అనువుగా రాష్ట్రంలో విధానాలకు రూపకల్పన చేశామని తెలిపారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులకు తాను సమన్వయకర్తగా ఉంటానని పేర్కొన్నారు. సుదీర్ఘ తీర ప్రాంతంలో చమురు, గ్యాస్, ఫుడ్ ప్రాసెసింగ్, మైనింగ్, పర్యాటకం, ఆతిథ్యం వంటి వేర్వేరు రంగాల్లో అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతికూలతలు ఉన్నా దుబాయిని పర్యాటక స్వర్గధామంగా అక్కడి పాలకులు మార్చారని తెలిపారు. 2029 నాటికి భారతదేశం అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అన్నారు. యుఎఇతో ఉన్న సత్సంబంధాల ద్వారా మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికాలో సిలికాన్ వ్యాలీ మాదిరి అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పెట్టుబడిదారులు ప్రతిపాదనలతో వస్తే అన్ని అవకాశాలు కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సిఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా యుఎఇ-ఎపి మధ్య అవగాహన ఒప్పందం జరిగిందన్నారు. ఈ సదస్సులో మంత్రి టిజి భరత్, సిఎస్ కె విజయానంద్, సిఐఐ ప్రెసిడెంట్ ఆర్ ముకుందన్, లూలూ ఇంటర్నేషనల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ యూసుఫ్ ఆలీ పాల్గొన్నారు. అనంతరం యుఎఇ మంత్రితో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి.

బ్రిటన్ ఆందోళనలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం

- అహ్మదాబాద్ విమాన దుర్ఘటనపై భారత్ వివరణ

న్యూఢిల్లీ : అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో మృతి చెందిన వారి భౌతిక కాయాలు, అవశేషాలు తారుమారయ్యాయని బ్రిటన్ మీడియాలో వచ్చిన కథనాలపై భారత ప్రభుత్వం స్పందించింది. ఇప్పటికే అమల్లో వున్న ప్రొటోకాల్స్ అన్నీ పాటించి బాధితులను గుర్తించామని తెలియజేసింది. బాధితులను గుర్తించి, వారి భౌతిక కాయాలను కుటుంబాలకు అప్పగించడంలో అత్యంత నిబద్ధతతో వ్యవహరించామని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. అంత్యక్రియలకు అన్నీ సిద్ధం చేసుకున్న తర్వాత భౌతికకాయాలు తారుమారయ్యాయని, కొన్ని కుటుంబాలకు ఒకటి కన్నా ఎక్కువ చేరాయని వార్తలు రావడంతో కొన్ని కుటుంబాలు అంత్యక్రియలను కూడా నిలిపివేసుకునే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని బ్రిటీష్ దినపత్రిక డైలీ మెయిల్ ఒక వార్తా కథనాన్ని ఇచ్చింది. దానిపై భారత ప్రభుత్వం పై రీతిలో స్పందించింది. బ్రిటన్ కుటుంబాల తరపున లాయర్ లేవనెత్తిన ఆందోళనలను పరిష్కరించడానికి బ్రిటన్ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని భారత ప్రభుత్వం తెలియజేసింది.

అవినీతిపై పోరు నీరుగారుస్తున్నారు !

- ఉక్రెయిన్ వ్యాప్తంగా వెల్లువెత్తిన ప్రజాగ్రహం
- ఆ బిల్లును వీటో చేయాలంటూ నిరసన ప్రదర్శనలు

కీవ్ : దేశంలో అవినీతి నిరోధక వ్యవస్థకు ముప్పుగా పరిణమిస్తున్న వివాదాస్పద బిల్లును నిరసిస్తూ ఉక్రెయిన్‌వ్యాప్తంగా రాజధాని కీవ్ సహా పలు నగరాల్లో మంగళవారం వేలాదిమంది ప్రజలు ప్రదర్శనలు నిర్వహించారు. బిల్లును వీటో చేయాలంటూ అధ్యక్షుడు జెలెన్‌స్కీని డిమాండ్ చేశారు. 'వీటో ది లా', అవినీతి నిరోధక వ్యవస్థను కాపాడాలి, ఉక్రెయిన్ భవితవ్యం పరిరక్షించాలి' అని రాసి వున్న ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలన్నింటికీ తాము వ్యతిరేకమంటూ నినాదాలు చేశారు. రష్యాతో మూడేళ్లకు పైగా సాగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ప్రధానమైన నిరసన ఇది. ఇప్పటికే యుద్ధంతో అతలాకుతలమవుతున్న దేశంలో ప్రజల ఆగ్రహావేశాలు, అసహనం బాగా వ్యక్తమైంది. అవినీతిపై పోరు కన్నా వ్యక్తిగత సంబంధాలకు, విశ్వాసపాత్రులుగా వుండేందుకే ఉక్రెయిన్ నాయకత్వం ప్రాధాన్యతనిస్తోందని తీవ్రంగా విమర్శించారు. రాజ్యాంగాన్ని, చట్టాలను పరిరక్షిస్తామని ప్రతినచేసి అధికారంలోకి వచ్చిన వారు ఈనాడు తమని తమ అంతర్గత బృందాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జెలెన్‌స్కీ కార్యాలయం ఈ నిరసనలపై ఇంతవరకు స్పందించలేదు. దేశంలోని రెండు కీలకమైన అవినీతి నిరోధక సంస్థల పర్యవేక్షణను కఠినతరం చేసేందుకు ఉద్దేశించిన బిల్లును ఉక్రెయిన్ పార్లమెంట్ ఆమోదించింది. ఈ చర్య వల్ల ఆ సంస్థల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు గణనీయంగా బలహీనపడతాయని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. అవినీతి అంశాల్లో దర్యాప్తులపై అధ్యక్షుడు జెలెన్‌స్కీ బృందానికి మరింత పట్టును ఇస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జెలెన్‌స్కీ బిల్లుపై సంతకం చేయడంతో అది చట్టంగా మారింది. పశ్చిమ దేశాలు, యూరోపియన్ యూనియన్ ఒత్తిడి మేరకు ఈ బిల్లు తీసుకురావడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొత్తగా తీసుకువచ్చిన మార్పులతో, ఉక్రెయిన్ జాతీయ అవినీతి నిరోధక బ్యూరో (ఎన్ఎబియు), ప్రత్యేక అవినీతి నిరోధక ప్రాసిక్యూటర్ కార్యాలయం (ఎస్ఎపిఓ)లు చేపట్టే కేసుల విషయంలో దర్యాప్తులపై ప్రాసిక్యూటర్ జనరల్‌కు కొత్త అధికారాలు సంక్రమిస్తాయి. ఎస్ఎపిఓ హెడ్ కేవలం సాధారణ అధికారిగా మారిపోతారు. ఎన్ఎబియు స్వాతంత్ర్యాన్ని కోల్పోయి, ప్రాసిక్యూటర్ జనరల్ కార్యాలయానికి సబ్ డివిజన్‌గా మారుతుందని ఆ సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశాయి.



యోధుడా .. లాల్ సలాం!



కామ్రేడ్ వీఎస్‌కు రెడ్ సెల్యూట్ ...

కమ్యూనిస్టు యోధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ విఎస్ అచ్యుతానందన్‌కు అశేష సంఖ్యలో ప్రజలు, అభిమానులు అంతిమ వీడ్కోలు పలికారు. గుండెల నిండా ఆ యోధుడి స్ఫూర్తిని నింపుకొని, పిడికిళ్లు పైకెత్తి అభివాదం చేశారు. "జోహార్ .. విఎస్ .." అంటూ అంతిమయాత్ర పొడవునా నినాదాలు చేస్తూ, నివాళ్లు అర్పించారు. వర్షంలో సైతం వేలాదిమంది ప్రజలు బారులు తీరి, ఆయన భౌతికకాయాన్ని దర్శించారు. తమ జీవితాల నిండా తన పోరాటాలతో, సేవలతో పెనవేసుకుపోయిన శతాధిక ప్రజానాయకుడికి కేరళ రాష్ట్రం యావత్తూ శోకతప్త హృదయంతో 'యోధుడా.. లాల్ సలాం!' అంటూ తుది వీడ్కోలు పలికింది.



నివాళులర్పిస్తున్న ఉద్యమ సహచరులు



ఆఖరి చూపు కోసం .. అంగ వైకల్యాన్ని దాటి ...



మీ ఆశయాలు సాధిస్తాం ...



కన్నీటి వీడ్కోలు



అభిమాన నేతకు అశ్రు నివాళి

చరిత్ర లిఖించిన దివ్య దేశ్‌ముఖ్

ఫిడే చెస్ ప్రపంచకప్ ఫైనల్‌కు చేరిన తొలి భారత మహిళగా ఘనత
నేడు టైబ్రేక్‌లో కోనేరు హంపికి ఛాన్స్

న్యూఢిల్లీ : భారత చెస్ క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్ సరికొత్త చరిత్ర లిఖించింది. జార్జియాలో జరుగుతున్న ఫిడే మహిళల చెస్ ప్రపంచ కప్‌లో భాగంగా బుధవారం జరిగిన సెమీఫైనల్ దివ్య విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో చైనా క్రీడాకారిణి, మాజీ ప్రపంచ చాంపియన్ జోంగ్యాయి తాన్‌పై దివ్య 1.5 - 0.5 పాయింట్లతో సంచలన విజయం నమోదు చేసుకుంది. ఈ విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. దీంతో ఫిడే వుమెన్స్ చెస్ వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరిన తొలి భారత మహిళగా దివ్య ఘనత సాధించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో సెకెండ్ సీడ్, చైనా క్రీడాకారిణి జూపై విజయం సాధించిన దివ్య సెమీ ఫైనల్‌లోనూ 19 ఏళ్ల దివ్య సత్తా చాటింది. ప్రపంచ ర్యాంకింగ్స్ 18వ



స్థానంతో టోర్నీని ప్రారంభించిన దివ్య అంచనాలకు మించి రాణించి ఫైనల్‌కు చేరుకుంది. కోనేరు హంపి, లీ-టింగ్-జిల మధ్య జరిగిన రెండో సెమీస్ మ్యాచ్ డ్రా అయ్యింది. ఈ గేమ్ సుమారు 75 ఎత్తులపాటు సాగింది. నేడు జరిగే టై బ్రేక్‌లో ఫైనల్‌కు చేరేదెవరో తేలిపోనుంది.



'ఛత్రపతి శివాజీ..' రద్దు

మరాఠా చక్రవర్తి 'ఛత్రపతి శివాజీ మహారాజ్' బయోపిక్ బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్‌తో తెరకెక్కుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఈ ప్రాజెక్ట్‌కు అమిత్ రాయ్ దర్శకత్వం వహించబోతున్నట్లు కూడా సమాచారం వచ్చింది. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్ రద్దయినట్లు దర్శకుడు అమిత్ రాయ్ ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ నిలిచిపోవడానికి గల కచ్చితమైన కారణాలను ఆయన వెల్లడించలేదు. అయితే బాలీవుడ్ పరిశ్రమపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'ఈ పరిశ్రమ క్రూరమైంద'ని విమర్శించారు. పరిశ్రమలో జరిగిన అనుభవం తనకు ఒక పాఠం నేర్పించిందని, అందుకే తన తదుపరి చిత్రాన్ని తానే నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నానని అమిత్ రాయ్ తెలిపారు.

'కరుప్పు' టీజర్ విడుదల

సూర్య హీరోగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో 'కరుప్పు' తెరకెక్కుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో త్రిష కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్‌ను బుధవారం రిలీజ్ చేశారు. గ్రామీణ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా, రివెంజ్ యాక్షన్ డ్రామాగా ఉండబోతుందని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో సూర్య ఒక గ్రామీణ నాయకుడిగా, న్యాయం కోసం పోరాడే మాస్ హీరోగా కనిపించనున్నారు. 2025 చివరి నాటికి ఈ సినిమా థియేటర్లలో విడుదల అయ్యే అవకాశం ఉంది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీలోనూ ఈ మూవీ రిలీజ్ అవుతుందని సమాచారం.





కోడి రామకృష్ణకు ఘన నివాళి

ప్రముఖ సినీ దర్శకుడు కీర్తిశేషులు కోడి రామకృష్ణ 76వ జయంతి కార్యక్రమాన్ని పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక మారుతి సినిమా హాలులో నిర్వహించారు. కోడి రామకృష్ణ చిత్రపటానికి కళాపరిషత్ అధ్యక్షులు కెవి కృష్ణ వర్మ ఆధ్వర్యంలో మేడికొండ శ్రీనివాసరావు (చౌదరి), వంగా నరసింహారావు, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, మానాపురం సత్యనారాయణ, కొయ్యాన సూర్యనారాయణ, నీలంశెట్టి సత్యప్రసాద్, దేవళ్ళ బుజ్జి, బొక్కా రామాకాంత్, సరిదే శివరామకృష్ణ ఘనంగా నివాళులర్పించారు. కెవి కృష్ణ వర్మ మాట్లాడుతూ పాలకొల్లులో పుట్టిన ఆయన తెలుగు సినిమా రంగంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానానికి ఏర్పర్చు కున్నారని అన్నారు. అతి సామాన్యమైన కుటుంబంలో జన్మించిన ఆయన అనన్య సామాన్యమైన నైపుణ్యంతో సినీ రంగంలో రాణించి అజరామమైన చిత్రాలను తీసి సినిమా రంగ చరిత్రలో గొప్ప వ్యక్తిగా నిలిచి పోయారన్నారు.

'హరి హర వీరమల్లు' విడుదల

పది రోజులపాటు టికెట్ ధరల పెంపు

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'హరి హర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకులు. నిధి అగర్వాల్ కథానాయిక. ఎఎం రత్నం నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా గురువారంనాడు పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతి ఇస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సినిమా విడుదలైన మొదటి రెండు వారాలు రేట్లు పెంచేందుకు అనుమతి ఇవ్వాలని చిత్ర నిర్మాత ప్రభుత్వాన్ని కోరగా, కేవలం మొదటి 10 రోజులకే రేట్లు పెంచడానికి ప్రభుత్వం అవకాశమిచ్చింది. ఈనెల 24 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ పెంచిన టిక్కెట్ల ధరలు అమల్లో ఉంటాయి. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో లోయర్ క్లాస్‌పై రూ.100 (జిఎస్‌టితో కలిపి) అప్పర్ క్లాస్‌పై రూ.150 (జిఎస్‌టితో కలిపి) పెంచుకునే వెసులుబాటు కల్పించగా, మల్టీప్లెక్స్‌లో రూ.200 (జీఎస్టీతో కలిపి) వరకు పెంచేందుకు అనుమతి ఇచ్చింది. బుధవారం రాత్రి 9గంటల పెయిడ్ ప్రీమియర్ ప్రదర్శనలకు కూడా అంగీకరించింది. ఈ టికెట్ ధర రూ.600 (జిఎస్‌టి అదనం) నిర్ణయించారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో మాత్రమే ఈ షోకు అనుమతి ఉంది. సినిమా విడుదల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో పాటు, పోలీస్‌శాఖకు కూడా మార్గనిర్దేశం చేసింది.



రాణించిన జైస్వాల్, కెఎల్ రాహుల్

తొలి వికెట్‌కు 94పరుగుల భాగస్వామ్యం
పంత్ కాలికి తీవ్ర గాయం
ఇండియా 264/4

మాంచెస్టర్: మాంచెస్టర్ వేదికగా ఇంగ్లండ్‌తో ప్రారంభమైన నాలుగో టెస్ట్‌తో టీమిండియా ఓపెనర్లు శుభారంభం అందించారు. జైస్వాల్, సాయి సుదర్శన్ అర్ధసెంచరీలతో రాణించడంతో తొలిరోజు ఆట నిలిచే సమయానికి భారతజట్టు 4 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టుకు ఓపెనర్లు కెఎల్ రాహుల్-జైస్వాల్ ఆదుకున్నారు. తొలి సెషన్ ముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 76 పరుగులు చేసిన భారత్‌ను కేఎల్ రాహుల్ 39, యశస్వి జైస్వాల్ 35 పరుగులతో రాణించారు. వీరిద్దరూ ఆచి తూచి ఆడుతూ.. అందివచ్చిన బంతులను బౌండరీలకు తరలిస్తూ గట్టి పునాది వేశారు. జట్టు స్కోర్ 94 పరుగుల వద్ద భారతజట్టు తొలి వికెట్ కోల్పోయింది. కెఎల్ రాహుల్(46) వద్ద క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత యశస్వి జైస్వాల్(58) అర్ధసెంచరీ పూర్తయ్యాక డాసన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో భారతజట్టు 120 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఆదుకుంటాడనుకున్న శుభ్‌మన్ గిల్(12) కూడా నిరాశపరచడంతో భారత్ 140 పరుగుల వద్ద మూడో వికెట్ కూడా కోల్పోయి కష్టాల్లో పడింది. కేవలం 46పరుగుల వ్యవధిలో భారతజట్టు మూడు వికెట్లు కోల్పోయింది. రెండో సెషన్‌లో ఇంగ్లండ్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వా రిషబ్ పంత్(37నాటౌట్) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో స్కోర్‌బోర్డును పరుగెత్తించాడు. మరోవైపు సాయి సుదర్శన్ కూడా అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో రిషబ్ పంత్ కాలికి బంతి తగిలి తీవ్ర గాయమైంది. దీంతో అతడు కారులో మైదానాన్ని వీడాల్సి వచ్చింది. తొలిరోజు ఆట నిలిచే సమయానికి జడేజా(19), శార్దూల్(19) క్రీజ్‌లో ఉన్నారు. ఈ టెస్ట్‌కు భారతజట్టు మూడు మార్పులతో బరిలోకి దిగింది. ఇంగ్లండ్ బౌలర్లు స్టోక్స్‌కు రెండు, వోక్స్, డాసన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. కరుణ్ నాయర్ స్థానంలో సాయి సుదర్శన్, నితీశ్ రెడ్డి స్థానంలో శార్దూల్ ఠాకూర్, ఆకాశ్ దీప్ స్థానంలో అన్షుల్ కాంబోజ్‌కు చోటు దక్కించుకున్నారు.



స్కోర్‌బోర్డు...

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)బ్రూక్ (బి)డాసన్ 58, కెఎల్ రాహుల్ (సి)క్రాలే (బి)వోక్స్ 46, సాయి సుదర్శన్ (సి)కర్సే (బి)స్టోక్స్ 61, గిల్ (ఎల్‌బి)స్టోక్స్ 12, పంత్ (రిటైర్డ్ హర్ట్) 37, జడేజా (బ్యాటింగ్) 19, శార్దూల్ (బ్యాటింగ్) 19, అదనం 12. (83 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 182 పరుగులు. **వికెట్ల పతనం:** 1/94, 2/120, 3/140, 4/235 **బౌలింగ్:** వోక్స్ 17-4-43-1, ఆర్చర్ 16-2-44-0, కర్సే 16-1-60-0, స్టోక్స్ 14-2-47-2, డాసన్ 15-1-45-1, రూట్ 5-0-19-0



చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్ సేన

ఇంగ్లండ్‌పై తొలిసారి టి20, వన్డే సిరీస్‌లు కైవసం

చెస్టర్-లీ-స్ట్రీట్: హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంతో భారత మహిళలజట్టు నయా చరిత్ర లిఖించింది. ఇంగ్లండ్‌పై టి20, వన్డే సిరీస్‌లను చేజిక్కించుకున్న తొలి భారత జట్టుగా రికార్డుపుటల్లోకెక్కింది. ఛెస్టర్-లీ-స్ట్రీట్ వేదికగా మంగళవారం జరిగిన మూడో, చివరి వన్డేలో హర్మన్ సేన 13పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకుంది. దీనికి ముందు టి20 సిరీస్‌ను కైవసం చేసుకున్న భారతజట్టు వన్డే సిరీస్‌ను చేజిక్కించుకొని ఈ పర్యటనను దిగ్విజయంగా ముగించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 50 ఓవర్లకు ఐదు వికెట్ల నష్టానికి 318 పరుగులు భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అద్భుత బ్యాటింగ్ (102 పరుగులు) చేసి కెరీర్‌లో ఏడో శతకాన్ని నమోదు చేయగా.. జెమీమా రోడ్రిగ్స్ (50 పరుగులు)తో నాలుగో వికెట్‌కు 110 పరుగులు జోడించింది. 319 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు ఇంగ్లండ్ 305 పరుగులకే ఆలౌట్ అయ్యింది. టీమిండియా బౌలర్ క్రాంతి గౌడ్ తొలుత ప్రారంభంలోనే రెండు వికెట్లు తీసి భారత జట్టులో ఉత్సాహం నింపింది. ఆమీ జోన్స్ (4), టామ్సిన్ బ్యూమాంట్ (2) కాంత్రి బౌలింగ్‌లో పెవిలియన్‌కు చేరారు. ఆ తర్వాత ఎమ్మా లాంబ్ (68), నట్ స్కీవర్ బ్రంట్ (98) రాణించారు. వీరు మూడో వికెట్‌కు ఇద్దరు 160 పరుగులకుపైగా భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు దక్కాయి.

వన్డేల్లో ఆరు వికెట్లు తీసిన భారత మహిళా బౌలర్లు..

6/10 : మమత మాబెన్ (శ్రీలంకపై, 2004)
6/20 : దీప్తి శర్మ, (శ్రీలంకపై, 2016)
6/31 : జులన్ గోస్వామి, (న్యూజిలాండ్‌పై, 2011)
6/31 : దీప్తి శర్మ, (వెస్టిండీస్‌పై, 2024)
6/52 : క్రాంతి గౌడ్, (ఇంగ్లండ్‌పై, 2025

విదేశాల్లో పర్యటనల్లో గెలిచిన వన్డే, టి20 సిరీస్‌లు..

2018 దక్షిణాఫ్రికాలో (వన్డే 2-1, టి20 3-1)
2018 శ్రీలంకలో (వన్డే 2-1, టి20 4-0)
2019 వెస్టిండీస్‌లో (వన్డే 2-1, టి20 5-0)
2022 శ్రీలంకలో (వన్డే 3-0, టి20 2-1)
2025 ఇంగ్లండ్‌లో (వన్డే 2-1, టి20 3-2)

ప్రి క్వార్టర్స్‌కు సింధు

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

హాంగ్జౌ: చైనా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లకు రాణించారు. రెండోరోజైన బుధవారం పివి సింధు, చిరాగ్-సాత్విక్ జంట ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో పివి సింధు ఏకంగా 6వ సీడ్, 18ఏళ్ల మియాజకి(జపాన్)ను చిత్తుచేసింది. మియాజకిపై సింధు గెలుపొందడం ఇది వరుసగా రెండోసారి. హోరాహోరీగా సాగిన ఈ గేమ్‌లో సింధు 21-15, 8-21, 21-17తో మియాజకిని చిత్తుచేసింది. తొలి గేమ్ ప్రారంభం నుంచి సింధు అద్భుతంగా రాణించింది. తొలుత ఏకంగా ఏడు పాయింట్లు సాధించి ప్రత్యర్థికి గుక్క తిప్పుకోకుండా చేసింది. ఇక రెండో గేమ్‌లో మియజకి ప్రారంభం నుంచి చెలరేగి 12-8 పాయింట్ల ఆధిక్యతలో నిలిచింది. ఇరువురు షట్లర్ల మధ్య జరిగిన ఈ గేమ్ సుమారు 62 నిమిషాలసేపు సాగింది. జపాన్ ఓపెన్ సూపర్-750 తొలిరౌండ్‌లో ఓడిన సింధు.. ఈసారి రాణించడం విశేషం. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట జపాన్ జంటను వరుససెట్లలో ఓడించింది. ఏకపక్షంగా సాగిన ఈ గేమ్‌లో సాత్విక్-చిరాగ్ 21-13, 21-9తో కెన్యా మిట్సుషి-హిరోకీ జంటను ఓడించారు. వీరు ఈ ఏడాది సెమీస్ మించి ముందుకు వెళ్లలేకపోయారు.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68